
## భార్యకు ప్రేమతో.. ఇట్లు, ఓ 'పూల'దాసు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 15 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 222 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## రోజూ 2 వేల మందికి అన్నదానం

యాదగిరిగుట్ట పాలక మండలి నిర్ణయం



2

## దేశానికి రాజ్యాంగమే దిక్సూచి..

# క్లిష్ట పరిస్థితుల్లోనూ బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్



### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

ఢిల్లీ, ఆగష్టు 14: వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా

...మిగతా 5లో






## జీవితాలు చితికిపోయినయ్.. కుటుంబాలు చెదిరిపోయినయ్

### 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'లో ప్రధాని మోడీ



ఢిల్లీ, ఆగష్టు 14: దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు కేంద్రం నిర్వహించే 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'లో ప్రధాని ప్రసంగిస్తూ.. ''ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. మరెన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాటి విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి'' అని ఆయన అన్నారు.

## అమరావతి అసెంబ్లీలో ఘనంగా 'మన సభ-జన సభ'

### ప్రజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేయడమే లక్ష్యం

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు,శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు

2





## రాయపూడి పరేడ్ గ్రౌండ్ లో... సీఎం చంద్రబాబు జెండా వందనం

2

# అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

### రూ.40 కోట్లతో 58 ఫైర్ ఫైటింగ్ వాహనాలు ప్రారంభించిన సీఎం

అమరావతి, ఆగష్టు 14,(మనం ప్రత్యేక ప్రతినిధి): అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా... ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన

...మిగతా 2లో



## శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు

# పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

- సభ్యుల మెడికల్ బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలి
- సభ్యుల పింఛను పెంపు ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించాలి
- శాంతిభద్రతలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు, అధునాతన సాంకేతిక నిఘా
- డిజిటల్ పాస్ల స్కానింగ్ అనంతరమే సభా ప్రాంగణాల్లోకి అనుమతి
- శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల

అమరావతి, ఆగష్టు 14,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసన సభ సమావేశాలను ప్రశాంతంగా, సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల అధికారులను ఆదేశించారు.

శుక్రవారం అమరావతిలోని శాసన సభ ప్రాంగణంలో శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధారణ ఏర్పాట్లు, పరిపాలనా అంశాలు, సభ్యులకు అందించాల్సిన సేవలు, శాంతిభద్రతలు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను సమీక్షించేందుకు సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, అదనపు డీజీపీ మధుసూదన రెడ్డితో వారు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

**పెండింగ్ ప్రశ్నలకు సత్వరమే సమాధానాలు**

ఈ సందర్భంగా శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ, సభా సమావేశాల్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత సమయంలో సమాధానాలు అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని పేర్కొన్నారు. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు

...మిగతా 2లో

# ఆర్థిక స్వాతంత్ర్యానికి 'స్త్రీ శక్తి' బాట

### ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాది

- ఇప్పటికి 87 కోట్ల ప్రయాణాలు..
- సగటున రోజుకు 24 లక్షలు
- 'స్త్రీ శక్తికి సంవత్సరం-రెట్టింపైన ఆత్మగౌరవం' పేరుతో రేపు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు
- మహిళలతో రేపు ప్రత్యేకంగా భేటీ కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆగష్టు 14,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్లో మహిళల ఆర్థిక సాధికారతకు 'స్త్రీ శక్తి' పథకం కొత్త అర్థాన్ని తీసుకొచ్చింది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్టు 15న ఈ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తూ వారి రోజువారీ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంతో మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలను వివిధ వర్గాల మహిళలు చేశారు. మహిళల ప్రయాణానికి ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్లను సబ్సిడీగా అందిస్తోంది. పథకం అమల్లోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటివరకు రూ.3,095 కోట్లు

...మిగతా 2లో

## ఏపీని సినీ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



విశాఖపట్నం,(మనం న్యూస్): విశాఖపట్నంలోని ప్రసిద్ధ గురుజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన 'కొరియన్ కనకరాజు' సినిమా విజయోత్సవ సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర యూనిట్ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..గతం కంటే చాలా విభిన్నంగా, అత్యంత పరిపక్వతతో కూడిన నటనను వరుణ్ తేజ్ ఈ చిత్రంలో కనబరిచారు.ఒకవైపు పూర్తి వినోదాత్మకమైన పాత్ర, మరోవైపు పవర్ఫుల్ గ్యాంగ్స్టర్ పాత్ర..ఈ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని సెల్యులాయిడ్ అద్భుతంగా పండించారు.మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన నటనా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, రెండు విభిన్న షేడ్స్ ఉన్న హోలిస్టిక్ క్యారెక్టర్ను చాలా అవలీలగా చేసి మెప్పించారు అని కొనియాడారు.. కమెడియన్ సత్య తన మార్క్ కామెడీతో థియేటర్లలో ఈలలు వేయించారని, ఈ చిత్రంతో ఆయనకు మరిన్ని గొప్ప అవకాశాలు వస్తాయని ఆకాంక్షించారు. హీరోయిన్ రీతికా ప్రతి ఫ్రేమ్లోనూ ఆకట్టుకునేలా నటించింది. వరుణ్, సత్య, రీతికల

...మిగతా 2లో



## ఏపీ డ్వాక్రా సభ్యులకు పి.యం.ఎఫ్.యం.ఈ-స్త్రీనిధి సరికొత్త పథకం

- ఆహార శుద్ధి రంగంలో సరికొత్త అవకాశాలు
- రు. 3 లక్షల వరకు యూనిట్ వ్యయంతో యూనిట్ ఏర్పాటు
- స్త్రీనిధి రుణంతో పి.యం.ఎఫ్.యం.ఈ సబ్సిడీ
- డ్వాక్రా సభ్యులు కూలి స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, ఆగష్టు 14,(మనం ప్రతినిధి): డ్వాక్రా మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్ది... వారు ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు

...మిగతా 2లో

## స్వాతంత్ర్య స్ఫూర్తితో స్వర్ణాంధ్ర సాధనకు అడుగులు వేద్దాం

### 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు



అమరావతి ఆగష్టు 14,(మనం ప్రత్యేక ప్రతినిధి): 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశానికి స్వేచ్ఛా వాయువులు అందించేందుకు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాల్సిన పవిత్ర సందర్భం స్వాతంత్ర్య దినోత్సవమని పేర్కొన్నారు. ఎందరో

...మిగతా 2లో

## నా వ్యాఖ్యల్ని దురుద్దేశంతోనే వక్రీకరించారు

2

## నా పార్థివ దేహం అవయవ దానానికి ఇవ్వాలి

### మాజీ మంత్రి రఘువీరారెడ్డి



పరిగి, ఆగష్టు 14 (మనం న్యూస్): తన మరణానంతరం పార్థివ దేహాన్ని మట్టిలో ఖననం చేయకుండా అవయవ దానానికి ఇవ్వాలని కుటుంబ సభ్యులకు తెలిపినట్లు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎన్ రఘువీరా రెడ్డి పేర్కొన్నారు. పరిగి మండలం సేవామందిరం ఏ ఎం లింగన్న క్యాంపస్లో ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నీలకంఠాపురం శాంతజయరాం

...మిగతా 2లో

# అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

(మొదటి పేజీ తరువాయి)

అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. వీటితో పాటు ఫైర్ స్టేషన్లల్లో మౌలిక వసతులపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున ఖర్చు పెడుతున్నాం. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయింది. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భార్యకు ప్రేమతో.. ఇట్లు, ఓ ‘పూల’దాసు

**బీజింగ్, ఆగష్టు 14:** తన భార్య ఇష్టపడిందని దాదాపు 200 ఎకరాల్లో ఒక పూలతోటను పెంచి ఆమెకు కానుకగా ఇచ్చాడు ఒక భర్త శిఖామణి. ఆ తోట ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద హోలీహాక్ గార్డెన్ గా పేరుపొందింది. చైనాలో డ్రీమ్ కపుల్ గా పేరొందిన జో జియోలిన్, యిన్ జీ.. జువాన్లాంగ్ ప్రాంతంలో దాదాపు 197 ఎకరాల్లో హోలీహాక్ గార్డెన్ ను వృద్ధి చేశాడు. హోలీహిక్స్‌తో తనకున్న అనుబంధం, అవంటే తనకున్న ఇష్టం గురించి ఓసారి యిన్ తన భర్తకు చెప్పారు. దీంతో, ఆమె కోసం ఒక తోటను నిర్మించాలని నిర్ణయించుకున్నాడుజియోలిన్. వెంటనే తన ఇంటిని అమ్మేసి జువాన్ లాంగ్ లో భూమి కొన్నారు. పదేళ్ల పాటు ఆ పూల మొక్కల పెంపకం కొనసాగించాడు. ఒక లోయ ప్రాంతాన్ని క్రమంగా విస్తరిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద హోలీహాక్ గార్డెన్ను ఆయన ఏర్పాటు చేశారని చైనా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# యాదగిరిగుట్టలో రోజూ 2 వేల మందికి అన్నదానం



**భువనగిరి, ఆగష్టు 14:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి కోసం, భక్తుల సౌకర్యాల కోసం పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపింది. కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. రోజూ 2వేల మంది భక్తులకు అన్నదానం అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం ముద్ర వేసింది. దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

## ఆర్థిక స్వాతంత్ర్యానికి ‘స్త్రీ శక్తి’ బాట

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం కోసం ప్రభుత్వం ఖర్చు పెట్టింది.

**ఆర్టీసీలో 76 శాతం బస్సులకు వర్తింపు**

ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ.. ఇలా ఐదు కేటగిరీల బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. మొత్తం 9,978 ఆర్టీసీ బస్సుల్లో 76 శాతం బస్సులు .. అంటే 7,631 బస్సులను ఈ పథకానికి వినియోగిస్తున్నారు. ఆలయాలకు నడిపే ప్రత్యేక బస్సు సర్వీసుల్లోనూ ఈ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. స్త్రీ శక్తి పథకం రాకముందు ఆర్టీసీ బస్సుల్లో మహిళల వాటా 40 శాతం ఉండగా.. ఇప్పుడు అది 62 శాతానికి పెరిగింది. రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా 9.47 లక్షల నుంచి 24 లక్షలకు చేరుకుంది. పథకం అమలవుతున్న బస్సుల్లో ఆక్యుపెన్సీ 93 శాతానికి చేరింది.

# రాయపూడి పరేడ్ గ్రౌండ్ లో.. సీఎం చంద్రబాబు జెండా వందనం

**అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి:** మరోవైపు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరణ, 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం చంద్రబాబు శనివారం జాతీయ జెండా ఆవిష్కరణ చేయనున్నారు .అమరావతి లోని రాయపూడిలోని రాష్ట్రస్థాయి అధికారిక వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్ ప్రణాళికలపై ప్రసంగించనున్నారు.కొత్త కార్యక్రమాల లాంఛన ప్రారంభం కూడా నేడు చేయనున్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో పౌరులను భాగస్వామ్యం చేసేలా 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు.

**ఆగస్టు 15 ఏర్పాట్లు – ప్రత్యే వేదిక సిద్ధం:**

తుళ్లూరు మండలం రాయపూడి పరేడ్ గ్రౌండ్స్లో రాష్ట్రస్థాయి వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు, ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. నేడు ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురుతుంది. రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సమ్మేళనాలపై జాతీయ జెండాలు ఎగరేసేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో సంబంధిత మంత్రులు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేసేలా శకటాల ప్రదర్శనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# నా పార్థివ దేహం అవయవ దానానికి ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఐ సెంటర్ ఆధ్వర్యంలో కీ.శే.చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్ష కేంద్రం (286వ విజన్ సెంటర్ )ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి మాట్లాడుతూ తాను మరణించిన తర్వాత భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ప్రకటించారు.ప్రతి ఒక్కరూ అవయవదానం, దేహదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమాజం మనకు ఎంతో ఇచ్చిందని ఈ సమాజ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాబట్టి ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు.ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో ప్రారంభమవుతున్న ఈ సెంటర్లో కంటి పరీక్షలన్నీ ఉచితంగా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత కంటి పరీక్షల ఆసుపత్రికి స్థలాన్ని కేటాయించిన ఏ ఎం లింగన్న సంస్థ అధ్యక్షుడు, కరస్పాండెంట్ కేటీ శ్రీధర్ ను ఈ సందర్భంగా రఘువీరారెడ్డి అభినందించారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో స్వర్ణాంధ్ర సాధనకు అడుగులు వేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

మహనీయుల త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ. వారి త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారు కలలుగన్న సుసంపన్నమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వాములు కావాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో బలమైన ఆర్థిక, సాంకేతిక శక్తిగా ఎదుగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టి లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ ‘స్వర్ణాంధ్రప్రదేశ్-2047’ లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వాతంత్ర్యం మనకు మహనీయులు అందించిన అమూల్యమైన వారసత్వం. దానిని కాపాడుకోవడం, దేశ సమగ్రతను పరిరక్షించడం మనందరి బాధ్యత. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకు సాగుదాం. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చెందిన భారత్, సుసంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వాములమవుదాం అని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం నింపాలని కోరుకుంటూ ప్రతి ఒక్కరికీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏపీని సినీ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కాంబినేషన్ ప్రేక్షకులను స్క్రీన్కు కట్టిపడేసిందన్నారు.

**ఆంధ్రప్రదేశ్లో సినీ పరిశ్రమ అభివృద్ధిపై స్పష్టత:**

ఏపీలో డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్ స్టూడియోలు వంటి ప్రాథమిక వసతుల నిర్మాణానికి నిర్మాతలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావలసిందిగా మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున అవసరమైన భూమి, పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కళాకారుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విజన్ ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు కలసి ఏపీలో చిత్ర పరిశ్రమ వేళ్లూనుకునేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని తెలిపారు.

# ఏపీ డ్వాక్రా సభ్యులకు పి.యం.ఎఫ్.యం.ఈ-స్త్రీనిధి సరికొత్త పథకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకాన్ని స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలు రు. 3 లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను స్త్రీనిధి రుణం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చని... దీనికి పియంఎఫ్.యంఈ పథకం కింద లభించే క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. ఈ పథకంలో మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి స్థానిక ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని.. ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను గా పరిగణించి, వారి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో ఎంపికైన మహిళలకు ముడిసరుకు సేకరణ, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం తరపున కల్పిస్తామని మంత్రి తెలిపారు. మహిళలకు కేవలం రుణం ఇవ్వడమే కాకుండా, వారి వ్యాపారం విజయవంతం అయ్యే వరకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ మహిళలు కూడా పారిశ్రామిక వేత్తలుగా తయారు కావడంతో పాటు ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన డ్వాక్రా మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం అభివృద్ధితో పాటు పలువురికి ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## నా వ్యాఖ్యల్ని దురుద్దేశంతోనే వక్రీకరించారు

- తన కాక్రోచ్ కామెంట్ల ప్రచారంపై సీజేఐ సూర్యకాంత్

**ఢిల్లీ, ఆగష్టు 14:** న్యాయస్థానంలో చేసిన మౌఖిక వ్యాఖ్యలను సందర్భం లేకుండా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి, చెప్పని మాటలను కూడా చెప్పినట్లుగా ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారమని వ్యాఖ్యానించారు.

కోర్టు విచారణలకు సంబంధించిన చిన్న వీడియో క్లిప్పులను అసందర్భానుసారంగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నా వ్యాఖ్యలను వక్రీకరించారు. నేను చెప్పని విషయాలను కూడా చెప్పినట్లుగా చూపించారు. ఇది చాలా దురదృష్టకరం. ముఖ్యంగా దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు జరుగుతున్న తీవ్రమైన దుష్ప్రచారం’ అని సీజేఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది. న్యాయస్థాన విచారణలను ప్రసారం చేసేటప్పుడు మీడియా బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు.

# శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

దీర్ఘకాలంగా పెండింగ్లో ఉండటం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి సకాలంలో, స్పష్టంగా, సమగ్రంగా సమాధానాలు అందేలా పటిష్టమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాధానం ఇవ్వడానికి వీలుకాని ప్రశ్నలు ఏవైనా ఉంటే, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ సంక్షిప్త సమాధానం అందించాలని సూచించారు. అదేవిధంగా దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రశ్నలను సమీక్షించి, వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చోట చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించి పెండింగ్ జాబితా నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. శాసన మండలి, శాసన సభల గౌరవాన్ని, సభ్యుల హక్కులను దృష్టిలో ఉంచుకుని ప్రశ్నలకు సమాధానాల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

సభా హామీల అమలుకు పటిష్టమైన వ్యవస్థ

సభా సమావేశాల సందర్భంగా మంత్రులు, సంబంధిత శాఖల తరపున ఇచ్చే హామీల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని వారు అధికారులకు సూచించారు. సభలో ఇచ్చిన హామీలను సంబంధిత శాఖలు నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేసేలా పర్యవేక్షణ, సమీక్షకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు.

సభా హామీల అమలులో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచడంతో పాటు, హామీల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించే విధంగా పటిష్టమైన వ్యవస్థను అమలు చేయాలని సూచించారు.

**సభ్యుల మెడికల్ బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలి**

శాసన మండలి, శాసన సభ సభ్యులకు సంబంధించిన సంక్షేమ అంశాలపై కూడా వారు అధికారులతో చర్చించారు. సభ్యుల పెండింగ్ మెడికల్ బిల్లుల చెల్లింపులను సత్వరమే పరిష్కరించి, అర్హత కలిగిన క్లెయిమ్లకు ఎటువంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్ బిల్లుల పరిష్కారంలో ఏవైనా పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**సభ్యుల పింఛను పెంపు ప్రతిపాదనలపై త్వరిత నిర్ణయం**

అదేవిధంగా సభ్యుల పింఛను సొమ్మును పెంచేందుకు పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలను కూడా సత్వరమే పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి ఒక కొలిక్కి తీసుకురావాలని శాసన మండలి అధ్యక్షులు, శాసన సభ స్పీకర్ అధికారులకు సూచించారు. సభ్యుల పింఛను పెంపు అంశానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనల స్థితిగతులు, అవసరమైన పరిపాలనా చర్యలు, ఆర్థికపరమైన అంశాలను సమీక్షించి, వీలైనంత త్వరగా తగిన నిర్ణయానికి రావాలని ఆదేశించారు.

**డిజిటల్ పాస్ల విధానం అమలు**

అనంతరం పోలీస్ ఉన్నతాధికారులతో శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ, శాసన మండలి, శాసన సభ సమావేశాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అదనపు డీజీపీ మధుసూదన రెడ్డిని ఆదేశించారు.

ఈ సమావేశాల్లో ఈసారి డిజిటల్ పాస్ల విధానాన్ని అమలు చేస్తున్నందున, పాస్లను తప్పనిసరిగా స్కాన్ చేసి, వాటి ధ్రువీకరణ అనంతరం మాత్రమే సంబంధిత వ్యక్తులను శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల్లోకి అనుమతించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

డిజిటల్ పాస్ల వినియోగం, స్కానింగ్, ధ్రువీకరణ ప్రక్రియపై భద్రతా సిబ్బందికి ముందుగానే పూర్తి అవగాహన కల్పించాలని, అనుమతించబడిన వ్యక్తులకే నిబంధనల ప్రకారం ప్రవేశం కల్పించేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**మన సభ–జన సభ కార్యక్రమానికి ప్రత్యేక భద్రత**

మన సభ - జన సభ’ కార్యక్రమాన్ని నేడు, రేపు నిర్వహిస్తున్న నేపథ్యంలో సాయంత్రం 6 గంటల నుంచి శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల్లోకి సందర్శకులను అనుమతించే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో కూడా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పీకర్ సూచించారు. సందర్శకుల ప్రవేశం, డిజిటల్ పాస్ల పరిశీలన, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భద్రతా తనిఖీలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా లోపాలపై ప్రత్యేక దృష్టి**

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లలో ఎక్కడైనా లోపాలు, గ్యాప్లు ఉన్నాయో ముందుగానే గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో సరిదిద్దాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల పోలీస్ అధికారులకు సూచించారు. సచివాలయం చుట్టూ విస్తృతంగా ఖాళీ ప్రాంతాలు ఉన్నందున, భద్రతాపరంగా ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సచివాలయం, శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల నాలుగు వైపులా పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు, అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థలను వినియోగించి నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ భద్రతను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఎటువంటి ఏమరపాటుకు తావులేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పీకర్ ఆదేశించారు. సభా సమావేశాలు జరిగే సమయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా, అదే సమయంలో భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి రాజీ లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశాల్లో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, గుంటూరు ఎస్.పీ. వకుల్ జిందాల్, సీఎం సెక్యూరిటీ ఎస్.పీ. భద్రయ్య, జాయింట్ సెక్రటరీ విజయరాజు, డిప్యూటీ సెక్రటరీ వనితా రాణి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి అసెంబ్లీలో ఘనంగా ‘మన సభ-జన సభ’

## ప్రజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేయడమే లక్ష్యం

### శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు,శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు

**అమరావతి, ఆగష్టు 14,(మనం ప్రత్యేక ప్రతినిధి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహిస్తూ,ప్రజలను ప్రజాస్వామ్య వ్యవస్థకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో చేపట్టిన ‘మన సభ - జన సభ’ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణం సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ఏపీ పోలీస్ బ్రాస్ బ్యాండ్ సింఫనీతో సందడిగా మారింది. ప్రజలు,విద్యార్థులకు అసెంబ్లీ ప్రాంగణంలోకి ఉచిత ప్రవేశం కల్పించి ఉభయ సభల సందర్శనకు అవకాశం కల్పించడం విశేష ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ, ‘మన సభ - జన సభ’ కార్యక్రమం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజల ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనడం హర్షణీయమన్నారు. తాను గతంలో సామాన్యుడిగా ఉన్నప్పుడు శాసనసభ ప్రాంగణంలోకి రావడానికి అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం సామాన్య ప్రజలకు సైతం ఉభయ సభలను సందర్శించే అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు. ప్రజలను ప్రజాస్వామ్య వ్యవస్థకు చేరువ చేసే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ‘మన సభ - జన సభ’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శాసనసభ కేవలం ప్రజాప్రతినిధులు సమావేశమయ్యే భవనం మాత్రమే కాదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిధ్వనిగా నిలిచే ప్రజాస్వామ్య దేవాలయం అని అభివర్ణించారు.రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు అసెంబ్లీ గ్యాలరీ నుంచి శాసనసభా కార్యక్రమాలను వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని స్పీకర్ తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని, యువత భాగస్వామ్యం పెరిగినప్పుడే రాజకీయ వ్యవస్థ మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉంటుందని అన్నారు. గతంలో రాజకీయాలు ఉన్నత విలువలు, ఆదర్శాలతో కొనసాగేవని గుర్తుచేశారు. ప్రజలకు శాసనసభ సందర్శన వంటి ప్రజాస్వామ్య సంప్రదాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు, శాసన వ్యవస్థకు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు సైతం అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పించడం ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ‘మన సభ - జన సభ’ కార్యక్రమం ప్రజలకు శాసన వ్యవస్థను మరింత చేరువ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల కోసం శాసనసభ ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర మాట్లాడుతూ, ‘మన సభ - జన సభ’ కార్యక్రమం శాసన వ్యవస్థలోనే ఒక వినూత్న నిర్ణయమని కొనియాడారు. ప్రజల మధ్య, ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ప్రజాస్వామ్య వ్యవస్థపై వారికున్న ఆసక్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ముందుగా కె.ఎల్. యూనివర్సిటీ విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు ఆహూతులను, సందర్శకులను ఉత్సాహపరిచాయి. ఏపీ పోలీస్ బ్రాస్ బ్యాండ్ సింఫనీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కాజ వెంకట సుబ్రమణ్యం శిష్యురాలు ఇరుకులపాటి లక్ష్మీ సహస్ర ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

అనంతరం విద్యార్థులు, ప్రజలను అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించి ఉభయ సభల సందర్శనకు అవకాశం కల్పించారు. అసెంబ్లీ భవనం, శాసనసభ, శాసన మండలి కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలను సందర్శించిన ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు.

ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో అసెంబ్లీ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రజలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్న నిర్ణయం పట్ల సందర్శకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

శనివారం సాయంత్రం కూడా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉభయ సభల సందర్శనకు ప్రజలకు అవకాశం కల్పించనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో రూ.859.22 కోట్ల విలువైన ఆస్తులు, ప్రయోజనాల పంపిణీ

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



**చిత్తూరు, ఆగస్టు 14 మనం న్యూస్:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు భారీగా ఆస్తులు, ఆర్థిక ప్రయోజనాలు పంపిణీ చేయుచున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల

పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జాయింట్ కలెక్టర్ స్టాల్స్ ను పరిశీలించారు ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలు, పుర ప్రముఖులు, విద్యార్థులు, స్వాతంత్ర సమరయోధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలి తెలిపారు

డీఆర్డీఏ ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి పథకాల ద్వారా మొత్తం 8,188 సంఘాలకు చెందిన 53,029 మంది సభ్యులకు రూ.777.81 కోట్ల విలువైన ప్రయోజనాలు అందించనున్నారు. ఇందులో బ్యాంక్ లింకేజీ కింద 3,676 స్వయం సహాయక సంఘాలు, 32,972 మంది సభ్యులకు రూ.584.79 కోట్ల ప్రయోజనాలు, ఉన్నతి పథకం కింద 421 మంది సభ్యులకు రూ.3.54 కోట్ల ప్రయోజనాలు, స్త్రీనిధి పథకం కింద 4,512 స్వయం సహాయక సంఘాలు, 19,636 మంది సభ్యులకు రూ.189.48 కోట్ల ప్రయోజనాలు ఉన్నాయి.మెప్మా ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా మొత్తం 665 గ్రూపులు, 647 మంది సభ్యులకు రూ.80.60 కోట్ల విలువైన ప్రయోజనాలను అందించనున్నారు. బ్యాంక్ లింకేజీ కింద 665 స్వయం సహాయక సంఘాలకు రూ.76.60 కోట్లు, కింద 599 మంది సభ్యులకు రూ.1.58 కోట్లు, ప్రత్యేక ప్రాజెక్టుల కింద 48 యూనిట్లకు రూ.2.42 కోట్ల విలువైన ప్రయోజనాలు అందనున్నాయి.

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈ-ఆటో పథకం కింద 25 మంది సభ్యులకు రూ.0.79 కోట్ల విలువైన ఈ-ఆటోలను అందించనున్నారు.

# తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల కఠిన చర్యలు



**తిరుపతి రూరల్ ఆగస్టు 14 మనం న్యూస్:** తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పద్మావతి పురం స్మశానం వద్ద ఐదు మంది ముద్దయులను అరెస్ట్ చేసి మొత్తం 5 కిలోల గంజాయిని స్వాదీనము చేసుకున్నాము. ప్రధాన నిందితుడైన అరుగొండం సోమశేఖర్ శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి తిరుపతి, రేణిగుంట పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో అరుగొండం సోమశేఖర్, అక్కల రథసారధి, షేక్ ఫైరోజ్ ఫైరు, పన్నూరు లీలాక్రిష్ణ, గురివింటి చరణ్ తేజ్లను అరెస్ట్ చేశారు.

- వెస్ట్ పోలీసులు - 13 కిలోల గంజాయి స్వాధీనం.

వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘాలో బాగంగా శుక్రవారం మెటర్నటీ హాస్పిటల్ రోడ్డు, రాజన్న పార్కు వెనుక ప్రాంతంలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13 కిలోల డ్రై గంజాయి, 4 సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో కొండామర్రి జగదీష్, గొడ్ల పార్థసారధి అలియాస్ పార్థు, షేక్ ఇర్ఫాన్, బడి పోలయ్యలను అరెస్ట్ చేశారు. పోలయ్య విశాఖపట్టణం ప్రాంతానికి చెందినవాడు, ఇతను అక్కడ నుంచి గంజాయిని తిరుపతి లో ముద్దాయిలకు విక్రయించేందుకు తీసుకోచ్చారు అని దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ -1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులకు సంబంధించిన వివరాలను తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు (పరిపాలన), కె. రవి మనోహరాచారి (శాంతి భద్రతలు) వెల్లడించారు.

# హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




**చిత్తూరు, ఆగస్టు 14.మనం న్యూస్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సూచించారు. సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ వద్ద 1000 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం 1000 మంది ద్విచక్ర వాహనదారులతో అమ్మపల్లి క్రాస్ నుంచి కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వరకు మెగా హెల్మెట్ బైక్ ర్యాలీ నిర్వహించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి,అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జి.డి. నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త మాదిరాజు గణేష్ రాజు,కుమార్ రాజు 1000 హెల్మెట్లను ఉచితంగా వితరణ చేశారు.

**రోడ్డు ప్రమాదం ఒక కుటుంబ భవిష్యత్తును మార్చేస్తుంది - కలెక్టర్**

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల రోడ్డు ప్రమాద గణాంకాలను పరిశీలిస్తే చిత్తూరు జిల్లాలో ప్రతి ఏడాది సుమారు 350 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీరిలో 150 నుంచి 170 మంది వరకు ద్విచక్ర వాహనదారులే ఉన్నారని, అదనంగా ప్రతి ఏడాది 400 నుంచి 450 మంది ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తికి జరిగిన విషాదం మాత్రమే కాదని, దాని ప్రభావం మొత్తం కుటుంబంపై పడుతుందని కలెక్టర్ అన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి రక్షణ చర్యలను తప్పనిసరిగా పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని సూచించారు.

# రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చడానికి సిపిఐ మద్దతు ఇవ్వండి



**తిరుపతి ఆగస్టు 14మనం న్యూస్:** రజకుల కులాన్ని షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చడానికి సిపిఐ మద్దతు ప్రకటించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్యకు శుక్రవారం ప్రవేట్ హోటల్ నందు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య, కోర్ కమిటీ సభ్యులు పి షణ్ముగం పాత్రలో ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అక్కనపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు పార్టీపరంగా లేఖ రాస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తెలియజేయడం జరిగిందని వివరించారు. అట్టడుగు వర్గాలలో అత్యంత వెనుకబడిన సామాజికంగా అన్ని రకాల ఇబ్బందులు పడుతున్న రజక కులాన్ని భారతదేశంలోని ఇతర 18 రాష్ట్రాల నందు అలాగే మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న విధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని తమ డిమాండ్ అని వివరించారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణం కమిషన్ ఏర్పాటు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరి కమిటీ సభ్యులు మల్లెల నాగరాజు రాష్ట్ర రజక ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంధం బాబు ,మనోహర్, సురేంద్ర, నారాయణ ,అనురాధ ,శేఖర్, రవి, తదితరులుపాల్గొన్నారు.



# దేశభక్తి మన ఊపిరి... తిరంగా మన గర్వం

- కూటమి పార్టీల ఆధ్వర్యంలో నగరంలో భారీ 'తిరంగా బైక్ ర్యాలీ'

**తిరుపతి,ఆగస్ట్ 14 మనం న్యూస్:** జాతీయ జెండా మన గౌరవానికి ప్రతీక... దాన్ని భుజానికెత్తుకుని దేశం కోసం నిలబడడమే దేశభక్తి అని కూటమి పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ జె బి శ్రీనివాస్ ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో భారీ 'తిరంగా బైక్ ర్యాలీ' నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి నుంచి ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ళ మండపం మీదుగా శ్రీదేవి కాంప్లెక్స్ వరకు జనసంద్రోహం నడుమ త్రివర్ణ పతాకాలతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తిని చాటడం, జాతీయ సమైక్యతను పెంపొందించడానికి కూటమి పార్టీల పిలుపుమేరకు ఘనంగా ర్యాలీ చేశామన్నారు. ప్రతి పౌరుడు తాను పుట్టిన భారతదేశానికి సేవ చేసేందుకు ముందుంటారని అన్నారు. ఐక్యతతో దేశ రాష్ట్ర అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తాతయ్య గుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వరప్రసాద్, తోట వాసు, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్వీఎం శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆముదాల తులసి, ఆముదాల వెంకటేష్, సుధాకర్,అంకాలమ్మ దేవాలయం చైర్మన్ కొండా రాజమోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు రఘు, మాజీ కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, మహిళా నాయకురాళ్లు భారతి, యశోద, అనిత, రేవతి, రేఖ కూటమి పార్టీల యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామీణ వ్యాపారులకు తోడుగా ట్రేడ్ లైసెన్స్

- వ్యాపారానికి రక్ష, రుణాలకు దారి



**చంద్రగిరి ఆగస్టు14మనం న్యూస్:** గ్రామ పంచాయతీల నుండి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ స్యాచురేషన్ పద్ధతిలో మంజూరు చేయుటకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా ప్రాథమికంగా చంద్రగిరి మండలంలోని మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామపంచాయతీలలో అన్ని రకాల వ్యాపారస్తులను గుర్తించి వారికి డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ల ఆవశ్యకత పై అవగాహన,సర్టిఫికేట్లను అందించే కార్యక్రమం కందులవారి పల్లె పంచాయతీలోని మీటింగ్ హాలు నందు జరిగింది. ఈ కార్యక్రమంలో మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామపంచాయతీ లోని ప్రాంతాలలో కిరాణా దుకాణాలు, రైస్/ఆయిల్ మిల్లులు, టీ స్టాళ్లు, చిన్న హోటళ్లు, వెల్డింగ్/ఫ్యాబ్రికేషన్ వర్క్షాపు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, టైలరింగ్ షాపులు, సెలూన్లు మొ అన్ని రకాల వ్యాపారస్తులు పాల్గొన్నారు. ట్రేడ్ లైసెన్స్ వ్యాపారవేత్తలకు ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట వ్యాపార కార్యకలాపాన్ని నిర్వహించడానికి గ్రామ పంచాయతీ జారీ చేసే చట్టపరమైన అనుమతి పత్రం. ఈ పత్రం పొందడం ద్వారా ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత సంబంధిత స్థానిక నిబంధనలను వ్యాపారులు పాటిస్తారని నిర్ధారిస్తుంది అలానే నిర్దిష్ట స్థలం ఆ రకమైన వ్యాపార కార్యకలాపానికి అనుమతించబడిందని ధృవీకరిస్తుంది.

# తిరుమల డ్యూటీలకు వెళ్లే ఉద్యోగ, కార్మికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

- ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా




**తిరుపతి ఆగస్టు 14 మనం న్యూస్:** తిరుమలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సమయానికి విధులకు చేరుకునేలా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నేడు తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుమల డ్యూటీలకు వెళ్లే కార్మికులు తెల్లవారుజామునే సిద్ధమై బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, సరైన సమయానికి బస్సులు లేక విధులకు ఆలస్యంగా చేరుకుంటున్నారని తెలిపారు. సాధారణ బస్సులు కొన్ని ప్రాంతాల్లో ఆగకుండా ఫ్లైఓవ్వ నుంచి వెళ్లిపోతున్నాయని, బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఏసీ బస్సుల్లో ఉద్యోగులు, కార్మికులను అనుమతించకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా ఎఫ్ఆర్ఎస్లో గైర్హాజరు నమోదు చేసి పనిష్మెంట్లు విధించడం అన్యాయమని పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

- రియల్టైమ్లో ఫిర్యాదుల పరిష్కారానికి 'నందకం' యాప్
- టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి

**తిరుమల,ఆగస్ట్ 14 మనం న్యూస్:** వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు.

శుక్రవారం తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ



సమావేశ మందిరంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సంబంధిత ఏజెన్సీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలను మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలపై ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించినట్లు చెప్పారు. తిరుమల పవిత్రతకు, స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచేలా మరింత మెరుగైన పారిశుద్ధ్య కార్యకలాపాలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఇందుకోసం అవసరమైన మెటీరియల్స్, ఆధునిక యంత్రాల వినియోగంపై కూడా చర్చించినట్లు వివరించారు.

# కలికిరి లో ఘనంగా ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కలికిరి ఆగస్టు 14 మనం న్యూస్:** స్థానిక ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి, మహాత్మా గాంధీ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా భారతదేశ పటాన్ని దీపాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ డబ్ల్యు ఆర్ డిగ్రీ కళాశాల నుండి భారీ త్రివర్ణ పతాకం చేపట్టి పట్టణంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థినులందరూ త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు.

# కొర్లగుంటలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

**తిరుపతి: ఆగస్ట్ 14, మనం న్యూస్:** మహిళల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు సమాజంలో పరస్పర సహకారాన్ని చాటేలా స్థానిక కొర్లగుంటలోని ప్రసన్న భారతి పాఠశాల వేదికగా రాస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రావణమాస వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం సర్వత్రా ఆకట్టుకుంది. ఈ



వేడుకకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ దేవిని పూజించారు.

**ఆధ్యాత్మికతతో పాటు పొదుపు ముఖ్యం:డాక్టర్ ఎస్. వెంకటరత్నం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల జీవితంలో క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన ఎంతో కీలకమైనదన్నారు. శ్రావణమాసం పవిత్రతను చాటుతూ ఇంత భారీ సంఖ్యలో మహిళలు ఒకచోట చేరి పూజలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

## నవకేతనం

కాలపు విలువ చెప్పే,
ధర్మమార్గం దారిచూపే,
నైతికవిలువల బాట తెలిపే,
బానిసత్వ నిరోధం
ఔన్నత్య సంకేతం
పురోగామి కేతనమై
స్వతంత్ర పోరాటయోధుల
త్యాగాలపునాదులమీద నిలిచి
ఏడున్నర దశాబ్దాలపైగా
అంబరాన రెపరెపలాడుతున్న
జాతీయజెండా...

రైతుల కన్నీటి కడలి మునకలు,
నాకేమిటి,నీకేమిటిల
వాటాల పరుగులు,
వ్యవస్థాగత మార్పులతో
వ్యాపారుల బేజారు,
కనుమరుగైన నిస్వార్థసేవలు,
కుటిల కుతంత్రాలకు
ఎందరో బలవుతోంటే,

ఎన్ని చట్టాలొచ్చినా
అబలలపై వికృతచేష్టలు
షరా మామూలు కాగా,
తిరోగామి వాగ్దానాల
కల్లోల వేదికలతో
వేసారిపోతోన్న వ్యవస్థను
బాధాతప్త హృదయంతో కని,
నిర్మల పాల కడలి వంటి సమాజానికై
ఎదురుచూస్తోంది ఆత్రంగా.
ఇప్పటికైనా ...
స్వతంత్ర భారతి మోముపై
సంతోషసుమాలు విరిసేట్టు
విశాల భావాల
నిర్భయ జీవన గమనాల
'నవకేతనం' ఎగరేద్దాం.
ముదమారా కలసి వేద్దాం
ముచ్చటైన భవితల రాచబాట.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

## స్వేచ్ఛా జెండా నీడలో...

స్వాతంత్ర్య సూర్యుడు నెత్తిన నిలిచినా
స్వేచ్ఛా నీడ కోసం మనిషి ఇంకా
వెతుకుతున్నాడు.

జెండా గుండెలో మూడు రంగులు
రెపరెపలాడుతున్నాయి.
జీవితాల్లో ఎందుకో మిగిలేది నలుపే...
దేశం ఒక అఖండ దీపమైతే..
దాని వత్తులై కాలిపోయిన వాళ్లెందరో...

రక్తంతో రాసిన చరిత్ర పుటలపై
స్వార్థం వల్ల చాలా మంది సంతకాలు చేస్తున్నారు.
పొలాల నుదుటిపై పగుళ్లు పూస్తుంటే
రైతు కన్నీరు కాలువై పారుతోంది...

పట్టణాల గాజు మేడల్లో వెలుగులు పూస్తుంటే
పల్లె చీకటి తన నీడను తానే మింగుతోంది.
కులం ఒక కత్తిలా గుండెల్ని కోస్తుంటే
మతం ఒక మంటలా మనసులను కాలుస్తోంది.

మనిషి మనిషికి మధ్య గోడలు పెరుగుతుంటే
భారతమాత ఒడిలో ఏకత్వం మూగబోతుంది...
అక్షరాలు అమ్ముడై వార్తలు వంగిపోతుంటే
నిజం నడిరోడ్డుపై నగ్నంగా నిలబడుతోంది...

న్యాయం నెమ్మదిగా నడిచే నడకను చూసి
అన్యాయం గుర్రమెక్కి పరుగెడుతోంది...
అయినా...ఈ నేల ఇంకా ఓడిపోలేదు

బొటనవేలి ప్రాణంతో
ప్రజాస్వామ్యం కొట్టుకుంటోంది
యువతరం కంట్లో కొత్త భారతం మెరుస్తోంది

జెండా కేవలం గాలికి ఊగే వస్త్రం కాదోయి
అది అమరుల ఊపిరితో ఎగిరే అగ్నిపతాకం
స్వాతంత్ర్యం కేవలం పండుగ చప్పుడు కాదోయి
ప్రతి అన్యాయానికి ఎదురు నిలిచే ప్రజా ప్రకటన

దేశాన్ని ప్రేమించడం అంటే...!?
దేశం గొప్పదని పాడుకోవటమే కాదు...
దేశం బాధను తన గుండెలపై మోపి

'మనిషే నా మతం, న్యాయమే నా జెండా' అని
నిలబడి నినదించడమే నిజమైన దేశభక్తి...
బోలో..స్వతంత్ర్య భారత్ కి జై...!

**- డా. కటుకోర్ఘ్వుల రమేష్**
9949083327

# భారత జాతీయ పతాక నేపథ్యం



త్రివర్ణ పతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది.1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో - చరఖా స్థానంలో 'ఆజాద్ హింద్' అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో - వాడుకొంది.

20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారత దేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. '(భారత) మాతకు వందనం' అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)' ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్ల తామర స్వచ్ఛతకు చిహ్నాలు. 1907లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం 1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్‌లో శచీంద్ర ప్రసాద్ బోస్‌చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని 'కలకత్తా పతాకం' అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి.. పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ పాటు సమాంతర గీతలను కలిగి ఉంది. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, కింది పట్టీ మీద నెలవంక, సూర్యుడు మధ్యలో దేవనాగరి లిపిలో 'వందేమాతరం' అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని సుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకు పచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార-నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా(రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు-ఆకుపచ్చ రంగు పట్టీల మీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.

1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు-దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్ఖులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు.

భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక యువకుడు జెండా తయారు చేసి గాంధీజీకి ఇచ్చాడు. ఈ కార్యక్రమం 1921లో బెజవాడ (ప్రస్తుతం విజయవాడ) లో జరిగింది. ఇది రెండు రంగులతో తయారు చేయబడింది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది.

'జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని' కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోం దనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు. తర్వాత 1931 కరాచీ కాంగ్రెస్ సమావేశంలో పై నుంచి కిందకు వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని స్వీకరిస్తూ జాతీయజెండాపై తుది తీర్మానం ఆమోదించబడింది.

స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయ పతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**- రామకిష్టయ్య సంగన భట్ల**
9440595494

# మూడు దశాబ్దాలు .. మూడు తరాలు.. మూడు భావజాలాలు



కాలం రీత్యా ఇది మూడు దశాబ్దాల కవిత్వం. తరాల రీత్యా ఇది మూడు తరాల కవిత్వం. భావజాలం రీత్యా ఇది మూడు భావజాలాల కవిత్వం. చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళ కవిత్వ చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళ బోధనం నర్సిరెడ్డి చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళలో తెలుగు కవిత్వ పరిణామ చరిత్ర ఇది. చరిత్ర కోసం కవిత్వం చదవక్కర్లేదు. సాహిత్య చరిత్రను చదవొచ్చు. దేశ చరిత్రలు చదవొచ్చు. బోధనం కవిత్వం ఎందుకు చదవాలి. ఎవరి కవిత్వమైనా ఎందుకు చదవాలి. మానవ స్పందనల్ని ఏ చరిత్రా రికార్డు చేయలేదు. సాహిత్యం తప్ప ముఖ్యంగా కవిత్వం తప్ప

బోధనం స్పందనల ఆధారంగా ఈ మూడు దశాబ్దాలను కొలుద్దాం. ఈ దశాబ్దాల ఆధారంగా బోధనం కవిత్వాన్ని కొలుద్దాం

వయసులో కొంచెం చిన్న వాడైనా కవిత్వంలో నాకన్నా పెద్దవాడు. బోధనం కవితా చేలాంచల కొసగాలుల విసురులు తొలుత అతని మీదే ప్రసరించినవి. విరసం (విప్లవ కవిత్వం) దందహ్యామాన దశాబ్దంగా పిలుపబడే '70'ల్లో కలం పట్టిండు. విప్లవ కవిత్వంలో సూర్యుడు ఒక బలమైన ప్రతీక. ఆ ప్రతీకను తీసుకొని ఎంతో మంది కవిత్వం రాసిన్రు. 'రక్తం సూర్యుడు' లాంటి సంకలనా లొచ్చినై.


'రంపపు పెట్టులాగా సహస్ర కిరణ కరాలెత్తుకుని సూర్యుడు దయిస్తాడు' స్థానికత లోంచి ఇంత మంచి పోలిక నెవరూ చెప్పలేదు. ఈ సంకలనంలోని మొదటి కవిత ఇది.

'విచ్చు కత్తులతో సూర్యుడుదయిస్తాడు'. విరసం సభ్యుడైనందుకా ఇంత శక్తివంతమైన వ్యక్తీకరణ? మంచి నిర్మాణ శిల్పం ఉన్న కవిత ఇది. శబ్దం, వాక్యం, భావం, జీవం ప్రపోర్షనేట్ గా ఉండటమే నిర్మాణ శిల్పం. అట్లాంటి మరో మంచి కవిత 'పరాజితుడు'. ఏ కవి కవిత్వంలోనైనా అంతర్లీనంగా అతని దృక్పథం ఉంటుంది. అయినా అనాది నుంచి అనేక మంది కవులు ప్రత్యేకంగా తమ కవిత్వం గురించి కవిత్వం రాసిన్రు. అట్లా బోధనం కూడా రెండు కవితలు రాసిండు. నాకైత, మంటను రాయడం చూడు - రెండింటిలో వస్తువొకటే అయినా నాకు సచ్చింది రెండో కవిత.'నా తల చీలికలయ్యేలా నన్ను దున్నుతున్న నాగేలు నా కవిత్వం నల్లద్దాల చల్లదనాన్నో నింగి చుక్కల చక్కదనాన్నో చూడకు నా కవిత్వంలో చెమటనూ చెమర్చిన కంటినీ చూడు'

ఇది ఒక దశ. ఈ దశకు ఇది ఒక ప్రాతినిధ్య కవిత.

'అయ్యా / ఇన్నాళ్లూ మీరు/ మాస్వేదాశ్రు ధారతో స్నానం చేసిన వాళ్లు/ మా కన్నీటితో / దాహం తీర్చుకున్న వాళ్లు మా అర్తనాదంలో సంగీతం విన్న వాళ్లు....కాని ఇప్పుడు...../ మేం మీ బానిసలం కాం/ మీలో ఒక్కరమూ కాం కాని మీరు మాత్రం / మాలో ఒకరు కండి'. మరొకటి.. విల్లె వంగిన / నా ఒళ్ళు చెప్పే పాఠం/ ఇక విల్లంబులే మరి శరణ్యం/ స్ఫురణ కొస్తోంది నాకరణ్యం. మొత్తం కోట్ చేయాల్సిన కవిత 'నగరం బాకీ'.

ఇది ఒకటోదశ. ఒకటోతరం.




1981 తరువాత 1992 దాకా కవితల్లేవు. 1982 లో యూనివర్శిటీ నుంచి బయటి కొచ్చిండు. యూనివర్శిటీ నుంచే బయటికొచ్చిండా? యూనివర్సల్ నుంచి వ్యక్తి జీవితం లోకి వచ్చి పడ్డాడా? విప్లవోద్యమ ఆవరణంలోంచి తనలోకి వచ్చి పడ్డాడా? లేక విప్లవోద్యమం తనను కట్టి పడేయలేక పోయిందా? ఏం జరిగిందో తెలియదు. మొత్తానికి ఈ కాలంలో మౌనమే ఈయన కవిత్వం.

ఈ సుదీర్ఘ నిశ్శబ్దం తరువాత....నిశ్శబ్దంగా లేడు- శబ్దం లేకుండా మౌనంగా ఘోషిస్తూనే ఉన్నడు. ఒక దశాబ్ద కాలాన్ని మోస్తూనే ఉన్నడు. మధన పడ్తూనే ఉన్నడు. ఘర్షిస్తూనే ఉన్నడు. దశాబ్దమౌనాన్ని, ఘర్షణను ఒకే కవితలో బళ్ళున బద్దలు చేసిండు.అది 'ఇంటలెక్చువల్స్'కవితలో.. 'అప్పుడప్పుడు / అడవిని గురించి ఆకాశం గురించీ/ చెట్లమాటు సూర్యోదయాల వక్రత గురించీ/ ఉద్రేకంతో ఉపన్యసిస్తాం/ తప్పటడుగుల నుంచి తప్పుకోని మనం/ భూభ్రమణంలో తప్పులు పడతాం చీకటి సుఖానికి రుచి మరిగిన మనం/ సూర్యుని మచ్చల్లో చీకట్లను దేవులాడతాం/ నలుగురితో కలిసి నడిచిన మనం/ ఆఖర్న అటుకొందర్నీ ఇటు కొందర్నీ పంపి/ ఒక్కరం వెనక్కి తిరిగొస్తాం'. కలుషితమైన ఒక దశాబ్దాన్ని యూరోప్ పరిణమాల్ని ప్రపంచ సామ్యవాద మార్పుల్ని కవితాత్మకంగా వ్యాఖ్యానిస్తడు. తప్పొప్పులు పక్కన పెడదాం-ఇది రెండో దశ. రెండో తరం.

కొంచెం ఆ హ్యాంగోవర్ ఇంకా మిగిలి ఉందేమో - 'సౌఖ్యసమాధిలో సుఖ నిద్రకై పరితపించకు/ చలనగుణాన్ని శరీరంలో జీర్ణించడమే నిజంగా మనం జీవించడం' అంటాడు. అప్పటికే కొత్త ప్రశ్నలు- పాత సమాధానాలు. బాలగోపాల్ అన్నట్లు కొత్త ఉద్యమాలు - పాత సిద్ధాంతాలు మొదలై చాలా సంవత్సరాల గడువు దాటింది. లింగ, కుల, ప్రాంత, మత వేదనలు 1995 ప్రాంతం నుంచి వీటి నుండి ఎవరూ తప్పించుకోలేని స్థితి వచ్చింది.

ఈ నేపథ్యంలో బోధనం నర్సిరెడ్డి 'మై కెమీలియన్ ఫాదర్' అనే అద్భుత కవిత రాసిండు. ఆయన మొత్తం కవిత్వంలో ఇది గొప్ప కవిత. ప్రపంచ కవిత్వంలో చేరదగిన కవిత ఇది. ఎన్.ఆర్.బోధనం బోధనం నర్సిరెడ్డిగా వ్యక్తం కాక తప్పని స్థితి. అసలు సిసలు దిగంబర కవిత ఇది. తెలుగు కవిత్వంలో మరే కవితలోనూ బహుషా ప్రపంచ కవిత్వంలోనూ పోల్చలేని రూపరీత్యా, వస్తురీత్యా యునిక్ కవిత ఇది. 'ముడ్డి మొల్తాడుకు రెండు మెల్కలేసి/ కాసెగట్టి గోసిబోసినప్పుడు/ కాల్వకిందికి జీవాల్ని తోలుతున్న పర్వతాలు మా నాయ్న'...అట్లా మొదలై ఎన్నెన్ని కులాలుగా డికాస్టిఫై అయి...చెల్లెలు మనుసుపడ్డ చంద్రయ్యను/ కులం తక్కువోడని/ రచ్చకాడ పెద్ద మనుషులతో గలిసి/ తానూ నాలుగు దన్నినప్పుడు మాత్రం/ బోధనం అంతిరెడ్డి పటేలు మా నాయ్న'

ఇక్కడ మాత్రం డికాస్టిఫై కాని శతాబ్దాల భారత కుల వ్యవస్థపైన పిడుగులు కురిపించిన కవిత ఇది.

భారతదేశ కుల వ్యవస్థ మీద లోతైన, గాఢమైన వ్యాఖ్యానమిది. ఈ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో స్త్రీ అస్తిత్వాన్ని గురించి రాసిన 'చెదనుదులిపెయ్' తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపే 'పంచాయితీ' మంచి కవితలు. ఈ అస్తిత్వ ఉద్యమాల కొనసాగింపుగా వచ్చిన 'పురుగు' కవితలో మాత్రం తన సహజ సంయమనాన్ని మించిన ఆవేశం చూపిండు. నిప్పులు చెరిగిండు. దీనికి ఎవరి 'అతి' ఎంత కారణమో ఎవరికి వాళ్ళే వివేచించుకోవాలి. ఇది మూడవ దశ, మూడవ తరం.బోధనం నర్సిరెడ్డి అంటే బోధనం ఊరి నుంచి వచ్చినవాడు మార్గ కవిత నుంచి కాక దేశికవిత నుంచి వచ్చిన వాడు. అప్రాతిపదిక మీదే అద్భుతమైన కథలు రాసిండు. కాని కవిత్వంలో చాలా కవితల్లో 'మార్గ'ను వదిలిపెట్టలేదు - అది పదాల్లో వాక్యాల్లో వ్యక్తమయింది. మార్గను వదిలి వేస్తే మంచి లక్ష్యంతో దేవరాజులా వ్యక్తం కావడానికి పుష్కలమైన సంపత్తీ ఉన్నవాడు. అదే ఆయన బలం. ఆ బలంతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ...

**- సుంకిరెడ్డి నారాయణరెడ్డి**

## నా ఎనభయో ఏటా...

బిడ్డలు...
తోవ దొరకని నాడు మీరు నడిసిన అడుగులే
దారులు సూపినై
అది డిల్లీ ఐతేంది గల్లీ ఐతేంది
జార్ఖండ్ ఐతేంది అంధుల హాస్టల్ ఐతేంది
ఎట్లయితే గట్లాయననే మీ నిజాయితీ తెగింపు
ఇప్పుడు నా భయాల సంకెళ్ళను తెంపినై
మిమ్ముల బొద్దింకలన్నారు గానీ కొడుకులారా
మీరు తేనెటీగలోలే కరుస్తుంటే
వాళ్ళిప్పుడూ మంటేడ పెట్టాల్నో,
మందెక్కడ పూసుకోవాల్నో తెల్వక
తక్కిడమిక్కడం ఐతంద్రు తండ్రులారా...
మీలో
లాఠీలకు ఒళ్ళప్పజెప్పి నిలబడ్డపుడు
ఒక చెంప కొడితే ఒక ఇంకొక చెంప
సూపెట్టమన్న
గాంధీలోలే కనపడ్డరు
నెత్తరిత్తే స్వాతంత్ర్యం తెత్తన్న సుభాష్
చంద్రబోసును మరిపించిండ్రూ
మీరే మీ నెత్తురంతా ధారబోస్తూ
విప్లవం వర్ధిల్లాలి అన్న భగత్ సింగ్
తమ్ములంతా మీరేనని
మీరిచ్చే నినాదాలల్లా నిప్పులోలే మీరు


మండినప్పుడే అర్థమైంది
ఈ దేశానికి ఆత్మైన అంబేద్కర్ కు
అసలైన వారసులు మీరేనని
రాజ్యాంగాన్ని గుండెలద్దుకునీ
నిరసనజెండాలైన నాడే ఎరుకైందిరా
నా ఎనభయేళ్ల పుట్టినదినంగోలె...
వాళ్ళ ఆశలను నిజం జేసుకోబోతున్నామనే గర్వతో
విర్రవీగేయాళ్ళకు
వందేళ్ళ వారి కలలను

పూచిక పుల్లల్లా టపటపా ఇరిశినపుడు
మీరు కరిసిన కరుపులకు
వాళ్ళ ఒళ్ళు , నోరు పద్ధతిగా కదులుతున్నపుడు
నాకు మనసు నిమ్మలమైంది

నా వందేళ్ళ పండుగనాడు నేను మీ చేతుల్లో
భద్రంగా ఉంటనని
ఊహాస్తేనే రక్తం వెచ్చగా కిందకి మీదకి
తన్నుకుంటున్నదిరా...
నన్నుత్త పటములా జేసీ పబ్బం గడుపుకునేటోళ్ల
చేతుల నుండి
నాలో కోట్లాది ప్రాణమున్న జీవినని తెలిసి
నన్ను కాపాడుకుంటారు కదా బిడ్డలూ...!!


**- దిలీప్.వి**
8464030808

# పేదరికాన్ని జయించడమే లక్ష్యం



పేదరికాన్ని జయించడమే మన దేశ లక్ష్యం కావాలి. 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న ఈ సమయంలో, భారత్ ఎంత అభివృద్ధి చెందిందన్నది మాత్రమే ప్రశ్న కాదు. ఆ అభివృద్ధి ప్రతి కుటుంబానికీ స్థిరమైన అవకాశంగా మారిందా అన్నదే అసలు ప్రశ్న. భారత్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, బహుముఖ పేదరికం 2015-16లో 24.85 శాతం నుంచి 2019-21 నాటికి 14.96 శాతానికి తగ్గింది. అంతేకాదు, 2022-23 నాటికి ఇది 11.28 శాతానికి చేరినట్లు అంచనా. 2013-14 నుంచి 2022-23 మధ్య సుమారు 24.82 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని ఈ గణాంకాలు తెలుపుతున్నాయి.

పేదరికం అంటే కేవలం తక్కువ ఆదాయం మాత్రమే కాదు. ఒక కుటుంబం పేదరిక రేఖను దాటినా, తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా పంట వైఫల్యం వంటి ఒక్క దెబ్బ దాని ఆర్థిక స్థితిని మళ్లీ కుదేలు చేయగలదు. అందుకే పేదరికాన్ని ఆదాయం, ఆరోగ్యం, విద్య, గృహ వసతులు, పోషకాహారం వంటి అనేక కోణాల ద్వారా సంపూర్ణంగా పరిశీలించాలి. ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ తీవ్ర పేదరిక ప్రమాణాన్ని సవరించింది. కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారిపోకుండా శాశ్వత ఆర్థిక స్థిరత్వాన్ని



కల్పించడంలో ఉంది. ఆర్థిక వృద్ధి వేగంతో పాటు, అది ఎన్ని ఉత్పాదక ఉద్యోగాలను సృష్టిస్తోందన్నది కూడా ముఖ్యమే. వ్యవసాయంలో సాగునీరు, ఉత్పాదకత, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెట్ అనుసంధానాలను మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ఆదాయాలను గణనీయంగా పెంచవచ్చు. అలాగే సూక్ష్మ సంస్థలకు తగినరుణం, సాంకేతికత, డిజిటల్ సామర్థ్యాలు అందితే అవి జీవనాధారం నుంచి ఉపాధి సృందించే సంస్థలుగా ఎదగగలవు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం అనేవి పేదరిక నిర్మూలనకు పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడులు. యువతకు ఉద్యోగ మార్కెట్‌కు సరిపోయే నైపుణ్యాలు అందాలి.

అలాగే ఒకే నమూనా అందరికీ సరిపోదు. జిల్లా స్థాయిలో పేదరికానికి అసలు కారణాన్ని గుర్తించి, దానికి తగిన స్థానిక పరిష్కారాన్ని అమలు చేయాలి. అయితే వాటి అంతిమ లక్ష్యం ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితిని కొనసాగించడం కాకుండా, ప్రతి కుటుంబాన్ని స్థిరమైన స్వయం ఉపాధి వైపు తీసుకెళ్లడం కావాలి. 1947 నుంచి భారత్ సాధించిన ప్రగతి అసాధారణమైనది. ఇప్పుడు ఆ ప్రగతికి తగినంత పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. పేదరికం, ఆకలి, అవకాశాల కొరత మనిషి జీవితాన్ని నిర్ణయించని స్వేచ్ఛా వాతావరణాన్ని సృష్టించడమే. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తదుపరి దశాబ్దానికి ఒక స్పష్టమైన సంకల్పం చేయాలి. అదే - పేదరికాన్ని తగ్గించడం కాదు. దాని పునరుత్పత్తిని పూర్తిగా ఆపడం, ప్రతి భారతీయుడికి తన భవిష్యత్తును తానే నిర్మించుకునే అవకాశం కల్పించడం!

**- కింజరాపు అమరావతి**

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

## పసిఫిక్ దీవిలో పుతిన్ పర్యటనపై
# జపాన్ అసహనం



**మాస్కో, ఆగష్టు 14:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం నాడు తొలిసారిగా పసిఫిక్ మహా సముద్రంలోని కురిల్ దీవులను సందర్శించారు, రష్యా నియంత్రణలో ఉన్న ఈ ద్వీప సమూహం తనదేనని జపాన్ వాదిస్తోంది. అందుకే పుతిన్ పర్యటనపై ఆ దేశం నిరసన తెలిపింది. పుతిన్ ఈ ద్వీప సమూహంలో దక్షిణ కొసన ఉన్న ఇటురుప్ దీవిలో చేపల కర్మాగారం, ఆసుపత్రి, పాఠశాలను సందర్శించారు. స్థానిక ప్రజలతో సంభాషించారు. కురిల్ ద్వీప సమూహంలో దక్షిణాగ్రాన ఉన్న నాలుగు దీవులు జపాన్ తనవేనంటోంది. వీటిని వారు ఉత్తర భూభాగాలు అని పిలుస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం చివరి రోజుల్లో సోవియట్ యూనియన్ వాటిని జపాన్ నుంచి స్వాధీనం చేసుకుంది. ఈ వివాదం కారణంగా రెండో ప్రపంచ యుద్ధం తరవాత రెండు దేశాలు శాంతి ఒప్పందంపై సంతకం చేయలేకపోయాయి. పైగా ఇటీవలి సంవత్సరాల్లో రష్యా కురిల్ దీవుల్లో తన సైనిక బలగాలను పెంచింది. జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మొటెగి మాట్లాడుతూ.. ఇటురుప్‌లో పుతిన్ పర్యటనను తమ దేశం తీవ్రంగా నిరసిస్తోందని స్పష్టం చేశారు.

## 2 సీటర్ విమాన ప్రమాద మృతులు భారతీయ యువకులుగా గుర్తింపు




**లండన్, ఆగష్టు 14:** తూర్పు ఇంగ్లాండ్‌లోని ఎస్సెక్స్ ప్రాంత ఒంగర్ పట్టణం వద్ద గత జూన్ నెల 30వ తేదీన జరిగిన 2 సీటర్ సెస్నా విమాన ప్రమాదంలో మృతులను భారతీయ యువకులుగా గుర్తించినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. ఈ విమానాన్ని పైలట్ డయాన్ పటేల్ (26) నడపగా, వంశీ మండల (24) అనే విద్యార్థి అందులో ప్రయాణించారు. వంశీ యూనివర్సిటీ చదువు పూర్తిచేసుకున్న సందర్భాన్ని వేడుకగా జరుపుకొనేందుకు చిన్నపాటి విమానయాత్రగా వీరు నార్త్ వీల్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగినట్లుగా ఎస్సెక్స్ పోలీస్ డిటెక్టివ్ చీఫ్ సూపరింటెండెంట్ మోర్గాన్ క్రోనిన్ తెలిపారు. తీవ్రగాయాలతో యువకులు ఇద్దరూ అక్కడికక్కడే మరణించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు ఈ కేసు విచారణకు వర్చువల్ పద్ధతిలో హాజరయ్యాయి.

## భారత్‌కు రానున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!



**టెహ్రాన్, ఆగష్టు 14:** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్లో ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 2024లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. గతేడాది బ్రెజిల్ వేదికగా ఈ సదస్సు జరగగా.. అనంతరం ఈ ఏడాది అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది. బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. గతేడాది ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ఇదిలా ఉంటే, రెండు నెలల క్రితం ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భారత్‌కు వచ్చిన సంగతి తెలిసిందే.

## చైనాకు భారత్ సాయం చేస్తోంది
# అమెరికా ఆరోపణలు

**వాషింగ్టన్, ఆగష్టు 14:** తమ సుంకాలను తప్పించుకోవడానికి చైనాకు భారత్ సహాయం చేస్తోందని అమెరికా ఆరోపించింది. ఇందుకు షాడో నెట్‌వర్క్ ఉపయోగపడుతోందని పేర్కొంది. ఆ నెట్‌వర్క్‌లో భారత్ సహా 40 దేశాలు ఉన్నాయని విమర్శించింది. 'ది గ్రేట్ ట్రాన్స్‌షిప్‌మెంట్ స్కామ్' పేరిట విడుదలైన నివేదికలో అగ్రరాజ్యం ఈ ఆరోపణలు చేసింది. దానిని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విడుదల చేశారు. అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నాయని భావించిన దేశాలపై అమెరికా సెక్షన్ 301 పేరిట టారిఫ్లను విధిస్తుంటుంది. 2018లో చైనాపై ఆ సెక్షన్ కింద ఆంక్షలు పెట్టింది. అప్పటి నుంచి చైనాకు అక్రమ సరకు రవాణా పెరిగిందని ఆ నివేదిక వెల్లడించింది. దాని విలువ 303 బిలియన్ డాలర్లు వరకు ఉంటుందని అంచనా వేసింది. రీలేబులింగ్, రీప్యాకేజింగ్, రవాణా మార్గాన్ని మార్చడం కోసం చైనా వస్తువులను ఇతర దేశాల మీదుగా పంపుతుంటారు. కార్మికులకు చెల్లించే వ్యయాలు తక్కువగా ఉన్న దేశాలు, కస్టమ్స్ పర్యవేక్షణ పెద్దగా లేని, అమెరికా మార్కెట్లోకి ప్రవేశించేందుకు అనుకూలంగా ఉండే దేశాల ద్వారా చైనా తయారీదారులు వస్తువులను తరలిస్తుంటారు. తయారైన దేశం నుంచి గాకుండా వేరే దేశం మీదుగా అమెరికాకు చేరే వస్తువులను గుర్తించేందుకు 'డిటెక్టివ్ బోర్డర్' పేరిట ఒక ఏఐ టూల్‌ను తీసుకువచ్చేందుకు అగ్రరాజ్యం ప్రయత్నాలు చేస్తోంది. షిప్‌మెంట్ రికార్డులు, రూటింగ్ హిస్టరీ, ఓనర్‌షిప్ లింక్స్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఆ టూల్ వాటిని గుర్తించనుంది.

## నేపాల్‌కు 'అగ్నిపథ్' సెగలు...
# గూర్ఖా సైనికుల ఆందోళన



**ఖాట్మండ్, ఆగష్టు 14:** జెన్-జీ ఆందోళనలతో ఏకంగా అధికార పీఠమే కదిలిన నేపాల్‌కు ఇప్పుడు మరో తలనొప్పి ఎదురైంది. పొఖారాలో గత కొద్ది రోజులుగా మాజీ గూర్ఖా సైనికులతో పాటు పెద్ద ఎత్తున యువత నిరసనలకు దిగారు. భారత ఆర్మీలోకి మళ్లీ నేపాలీ యువకులను పంపించాలనేదే వారి ప్రధాన డిమాండ్. ఇంతకీ వారి ఆందోళనకు కారణమేంటీ? అసలు భారత సైన్యంలో నేపాలీలు ఎందుకు ఉన్నారు? ఈ నియామకాలపై 'అగ్నిపథ్' ఎలాంటి ప్రభావం చూపించిందో తెలుసుకుందాం..!

**అగ్నివీరులమే అవుతామంటూ..**

భారత ఆర్మీ చీఫ్ ధీరజ్ సేథ్ ఈ నెల 16న ఖాట్మండ్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పొఖారాలో ఈ ఆందోళనలు మొదలయ్యాయి. అగ్నిపథ్ కింద భారత సైన్యంలోకి నేపాలీ యువతను తీసుకునేలా చర్చలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతకొంతకాలంగా రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటోన్న ఈ హిమాలయ దేశంలో.. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయి. దీంతో పొట్టకూటి కోసం వీరు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా.. గల్ఫ్‌లో ఉద్యోగం కంటే భారత సైన్యంలో పనిచేయడమే చాలా ఉత్తమమని వారు భావిస్తున్నారు. అందుకే అగ్నివీరులుగా తమకు అవకాశం కల్పించేలా చూడాలని అక్కడి యువత డిమాండ్ చేస్తోంది. మరోవైపు, గతంలో భారత సైన్యంలో పనిచేసిన తమకు గుర్తింపుతో పాటు హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని తమ ప్రభుత్వాన్ని కోరుతూ గూర్ఖా మాజీ సైనికులు సైతం ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు.

భారత సైన్యంలో సేవలందిస్తున్న ఏకైక విదేశం నేపాల్. 200 ఏళ్ల కంటే ముందే జరిగిన ఓ ఒప్పందం కారణంగా.. నేపాలీలు మన ఆర్మీలో సుదీర్ఘంగా కొనసాగారు. 1814-1816 మధ్య ఆంగ్లో-నేపాల్ యుద్ధం జరిగింది. ఆ సమయంలో గూర్ఖా సైనికుల శౌర్యానికి ముగ్ధుడైన ఈస్ట్ ఇండియా కంపెనీ జనరల్ డేవిడ్ ఆక్టర్లోని బ్రిటిష్ సైన్యంలో గూర్ఖా సైనికులను నియమించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అలా యుద్ధం ముగియడానికి ముందే 1815 ఏప్రిల్లో భారత గడ్డపై గూర్ఖా సైనికుల బెటాలియన్ ఏర్పడింది. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగగా.. బ్రిటన్ నుంచి రాజకీయ మద్దతు, దౌత్య ప్రయోజనాల కోసం నేపాల్ పాలకులు కూడా దాన్ని అంగీకరిస్తూ వచ్చారు.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం లభించిన తర్వాత.. బ్రిటన్, భారత్, నేపాల్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. బ్రిటిష్, భారత సైన్యంలో గూర్ఖా సైనికుల నియామకాలు కొనసాగించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇలా విదేశీ సైన్యంలో సేవలందించిన నేపాలీ సైనికులకు పింఛన్లు, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఆయా దేశాలే అందించాల్సి ఉంటుంది. ఒప్పందంలో భాగంగా నాలుగు గూర్ఖా రెజిమెంట్లు యూకేకు వెళ్లగా.. ఆరు స్వతంత్ర భారత్‌కు లభించాయి. ఆ తర్వాత గూర్ఖా రైఫిల్స్ పేరుతో మరో దళాన్ని కూడా భారత్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దాదాపు 35వేల మంది నేపాలీ సైనికులు భారత ఆర్మీలో పనిచేస్తున్నారు. అలాగే, 1.32లక్షల మంది మాజీ సైనికులున్నారు.

అయితే, 2020 కొవిడ్ మహమ్మారి కారణంగా భారత సైన్యంలోకి నేపాలీల నియామకాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత 2022లో కేంద్ర ప్రభుత్వం 'అగ్నిపథ్' పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ఈ నియామక ప్రక్రియను పునరుద్ధరించేందుకు నేపాల్ ప్రభుత్వం అనుమతించలేదు. ఈ పథకం 1947 నాటి త్రైపాక్షిక ఒప్పందం నిబంధనలకు అనుగుణంగా లేదని పొరుగు దేశం వాదించింది. సైన్యంలోని నిబంధనలను మార్చినప్పుడు తమ అభిప్రాయాలను తీసుకోలేదని ఆరోపించింది. దీన్ని భారత్ ఆనాడే తోసిపుచ్చింది. అది తమ ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పింది. అలా ఈ విభేదాల కారణంగా భారత సైన్యంలో నేపాలీల నియామకాలు ఆగిపోయాయి.

అయితే, ఈ నిర్ణయం కారణంగా స్వదేశంలో నేపాల్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఎదురైంది. భారత సైన్యంలో నియామకాలు కొనసాగినప్పుడు.. గూర్ఖా సైనికుల జీతభత్యాలు, ఇతర పరిహారం కింద ఏటా రూ.1000 కోట్ల మొత్తం నేపాల్ ఆర్థిక వ్యవస్థలోకి వెళ్లేది. ఇప్పుడు ఆ నిధులు ఆగిపోయాయి. దీనికి తోడు అస్థిరత కారణంగా స్వదేశంలో ఉద్యోగ అవకాశాలు దొరకట్లేదు. ఈ క్రమంలోనే నేపాల్లో ఆందోళనలు వెల్లువెత్తాయి.

## ప్రతి నీటి బొట్టూ
# భారత్‌కు రెడ్‌లైనే..

### 'సింధూ జలాల నిలిపివేత'పై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రేలాపనలు
### 2025 మే నాటి కంటే గట్టిగా ప్రతీకారం తీర్చుకుంటం



**ఇస్లామాబాద్, ఆగష్టు 14:** సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధూ జలాల్లో తమకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టును రెడ్‌లైన్‌గానే పరిగణిస్తామని ప్రేలాపనలు చేశారు. తమ నీటి హక్కులను కాలరాసేలా భారత్ ఎలాంటి చర్యలకు పాల్పడినా గట్టిగా బదులిస్తామని అన్నారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు చేశారు.''పాకిస్థాన్ శాంతిని కోరుకుంటోంది. కానీ, దాన్ని మా బలహీనతగా చూడకూడదు. మా సార్వభౌమత్వానికి, రక్షణ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లితే చూస్తూ ఊరుకునేది లేదు. 2025 మే నాటి కంటే గట్టిగా బదులిస్తాం'' అంటూ గతేడాది ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణలను షెహబాజ్ ప్రస్తావించారు. భారత్‌తో జరిగిన ఘర్షణల్లో తామే గెలిచామంటూ పాక్ ప్రధాని అన్నారు. అందువల్లే 'సింధూ జలాల'ను భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందని నిరాధార ఆరోపణలు చేశారు. 2025 ఏప్రిల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం.. పాకిస్థాన్‌తో ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడ వ్యవసాయంతో పాటు తాగునీటిపై తీవ్ర ప్రభావం పడుతోంది. సింధూ జలాలను విడుదల చేయాలని పదేపదే పాక్ డిమాండ్లు చేస్తోంది. అయితే నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనీ, సీమాంతర ఉగ్రదాడులను ఆపితేనే ఈ అంశంపై ఆలోచిస్తామని భారత్ ఇప్పటికే స్పష్టంగా చెప్పింది. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొంది.

## బలోచిస్థాన్ హోంమంత్రి
# కాన్వాయ్‌పై దాడి

### భద్రతా సిబ్బంది మృతి



**క్వెట్టా, ఆగష్టు 14:** బలోచిస్థాన్ హోంమంత్రి మీర్ జియావుల్లా కాన్వాయ్‌పై దాడి జరిగింది. దుండగులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది మృతిచెందగా.. ఆరుగురు గాయాలపాలయ్యారు. హోం మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మీర్ జియావుల్లా కలత్ ప్రాంతం నుంచి క్వెట్టాకు వెళ్తుండగా.. ఖడ్కోచా గోరు ప్రాంతంలో కొందరు సాయుధ దుండగులు ఆయన కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ కాల్పుల్లో కాన్వాయ్‌లోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.

ఈ దాడులకు ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటన చేయలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని స్థానిక పోలీసులు వెల్లడించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడి వెనుక బలోచ్ లిబరేషన్ ఆర్మీ హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తమకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్‌ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## అది నాకు, విద్యార్థులకు మధ్య సమస్య
### మీ జోక్యం ఎందుకు?: సీజేఐ



**ఢిల్లీ, ఆగష్టు 14:** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)ను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. సీజేఐను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్గా తీసుకున్నారు.

## ఇరాన్‌కు రెండు టన్నుల బంగారం ఇచ్చిన యూఏఈ
### అంతర్జాతీయ మీడియా కథనం



**అబుధాబి, ఆగష్టు 14:** చర్చలు, దౌత్య ప్రయత్నాలు నిలిచిపోవడంతో అమెరికా-ఇరాన్ యుద్ధం ఇప్పటికిప్పుడే ముగిసే సూచనలు ఏమీ కనిపించడం లేదు. రెండు దేశాలు అంతలోనే కాల్పులు విరమణ అంటున్నాయి.. ఆ వెంటనే దాడులు చేసుకుంటున్నాయి. తమపై అమెరికా బాంబుల వర్షం కురిపించిన వెంటనే.. ఇరాన్ గల్ఫ్ దేశాలను టార్గెట్ చేస్తోంది. ఇలా ఇంకా తాము లక్ష్యంగా మారకూడదని భావించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్‌ను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోంది. దానిలో భాగంగానే రెండు టన్నుల బంగారం ఇచ్చిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

అమెరికా ఆంక్షల కారణంగా ప్రపంచంలోని పలు దేశాల బ్యాంకుల వద్ద ఇరాన్ ఆస్తులు ఫ్రీజ్ అయి ఉన్నాయి. అలా తమ వద్ద ఉన్న నిధులను విడుదల చేసి, యుద్ధానికి దూరంగా ఉండాలని యూఏఈ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా ఆగస్టు 11, 12 తేదీల్లో అబుధాబి-టెహ్రాన్ మధ్య విమానాలు నడిచాయని తెలుస్తోంది. వీటిలో స్తంభింపజేసిన చేసిన ఇరాన్ నిధులను తరలించినట్లు సమాచారం. జూన్ 8న కూడా ఒక విమానం అబుధాబి నుంచి ఇరాన్‌లోని మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లింది. అప్పుడు మూడు బిలియన్ డాలర్లను ఇరాన్‌కు బదిలీ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇలా యూఏఈ తరలించిన నిధుల్లో 283 మిలియన్ డాలర్లు విలువైన రెండు టన్నులు బంగారం కూడా ఉందట.

అలాగే ఇరాన్ విమానయాన సంస్థలకు 15 సెకండ్ హ్యాండ్ విమానాలను అమ్మేందుకు కూడా యూఏఈ అంగీకరించినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. అవిగాక మరో 14 ప్యాసింజర్ విమానాలు కూడా తిరిగి ఇవ్వనుందట. రెండు ఎయిర్ బస్ విమానాలు ఇరాన్‌కు వెళ్లడానికి ముందు రొమేనియాలోని ఒక ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తమ 30 ప్యాసింజర్ విమానాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ గతంలో చెప్పింది. ఇప్పుడు యూఏఈ నుంచి వెళ్లే విమానాలు ఆ లోటును భర్తీ చేయనున్నాయి.పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు తీవ్ర రూపం దాల్చుతాయో తెలియని అనిశ్చితిలో.. తమ భూభాగంపై ఇరాన్ దాడులను నివారించేందుకు యూఏఈ ఈ ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తోంది. అలాగే ఆమెరికా ఆంక్షలు, యుద్ధంతో ఇరాన్ ఆర్థికంగా మరింత చితికిపోతోంది. ఈ సమయంలో నిధుల బదిలీ వల్ల టెహ్రాన్‌కు కాస్త బలం చేకూరొచ్చని తెలుస్తోంది.

## క్లిష్ట పరిస్థితుల్లోనూ బలమైన
# ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి వివరించారు.

# ఫీజుల జులుం ఎన్నాళ్లు?

- స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి
- భారీ ఫీజులతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచన
- ఫీజుల నియంత్రణ కోసం త్వరలో రౌండ్ టేబుల్ నిర్వహిస్తం
- తల్లిదండ్రులు, విద్యావేత్తలు హాజరుకావాలని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపుపై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు సరైన చట్టం లేకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని విమర్శించారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో త్వరలోనే ఓ రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆకునూరి మురళి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**భూం రాంగ్.. లీలలు**
### సీఎం డైరెక్షన్‌తోనే భూముల నిషేధం

- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో భాగంగానే కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని ఈటల చేసిన ఈ కామెంట్స్ తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి.
అయితే, నిషేధిత జాబితాలోకి భూములు మార్చు అనేది, ఇది నేరుగా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందని సీనియర్ నేత ఈటల రాజేందర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆయన మరోసారి తనదైన శైలీలో తీవ్ర ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ చేసిన ఈ సంచలన కామెంట్స్ తెలంగాణలో రాజకీయ రచ్చకు దారితీస్తాయని పొలిటికల్ విశ్లేశకులు చెప్తున్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు?
### రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** గత కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిప్పికొట్టారు. దమ్ముంటే తమతో వస్తే తాము కట్టిన ఇండ్లను, ఉంటున్న ప్రజలను చూపిస్తామని అన్నారు. ఈ మే రకు శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో 69 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. ఢిల్లీలో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్‌ల క్వార్టర్స్ ఈ విధంగా లేవని, నాటి గవర్నర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మెచ్చుకున్నారని తెలిపారు. కొల్లూరులో ఒక్క చోటే 16 వేల ఇండ్లను కట్టామని వెల్లడించారు. నాటి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను చూపించిన విషయాన్ని చూపించామని వెల్లడించారు. పేదవారి భూములను, ఇండ్లను 22 ఏ ద్వారా నిషేదిత జాబితాలో పొందుపరిచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. ఏమి తెలియనట్లు 22 ఏపై మీ భూమి మీకే ఇప్పిస్తా అని సీఎం ప్రకటించడం ఆయన ద్వంద్వవైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల భూమి ప్రజలకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు.



## పర్యావరణహితమే లక్ష్యంగా ఉండాలి

**కాట్రేనికోన ఆగస్టు 14 మనం ప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కాట్రేనికోన మండలం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం( పీహెచ్ సి ) వద్ద ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, వైద్యాధికారి పి నీలిమ నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు.వికసిత్ భారత్ -2047లో భాగంగా పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎన్ శంకర్ నారాయణ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శేషుబాబు, పంచాయతీకార్యదర్శి జె వి సత్యన్నారాయణ, శాంతిశ్వరూప్, వీబీజీ రాంజీ క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో సరస్మరణీయుడు వరుపుల రాజా



- ఎంపీలు ఎమ్మెల్యేలు కూటమి నాయకులు

**ప్రత్తిపాడు, ఆగస్టు 14 మనం న్యూస్:** దివంగత టీడీపీ నేత, ఆప్కాబ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ వరుపుల రాజా 51వ జయంతి వేడుకలు శుక్రవారం ప్రత్తిపాడులో అత్యంత వైభవంగా జరిగాయి. ఆయన సతీమణి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో భాగంగా తొలుత దివంగత వరుపుల రాజా విగ్రహాన్ని నేతలు ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అలాగే వికాశా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా రాజా ఆశయ సాధనలో భాగంగా యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సుమారు 50 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ జాబ్ మేళాను జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించగా, స్థానిక యువత పెద్ద ఎత్తున హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరం సైతం విశేష స్పందన పొందింది.

**ప్రజాసేవలో రాజా చెరగని ముద్ర: మంత్రి పి. నారాయణ..**


సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ దివంగత వరుపుల రాజా ప్రజాసేవనే పరమావధిగా జీవించారని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే సత్యప్రభను, రాజా అభిమానులను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ, రాజా ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిరంతరం సేవ చేసేందుకే ఈ తరహా బృహత్తర సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ప్రత్తిపాడులో వరుపుల రాజా జయంతి



**ఏలేశ్వరం , ఆగస్టు 14 ,(మనం న్యూస్);** ప్రత్తిపాడు నియోజకవర్గంలోని, ఏలేశ్వరం మండలం, సి రాయవరం గ్రామానికి చెందిన ఈపి రాజబాబు, దివంగత వరుపుల రాజా జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు, సి రాయవరం మాజీ సర్పంచ్ పలివెల వెంకటేశ్వరరావు సూచనలతో, ఈపి రాజబాబు ఆధ్వర్యంలో, స్వర్గీయ వరుపుల రాజా జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మెగా రక్తదానం మరియు మెగా జాబు మేళాకు ప్రత్తిపాడు లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈపి రాజబాబు మెగా రక్తదాన శిబిరంలో స్వయంగా తానే రక్తదానం చేసి, సి రాయవరం వాసులు అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, తమ అభిమాన నాయకులు స్వర్గీయ వరుపుల రాజా జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరంలో, రక్తదానం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, రాజా ఆశయాలను టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు సత్య ప్రభ రాజా ఆధ్వర్యంలో నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి , జ్యోతుల పెదబాబు, ఈపి రాజబాబు, దేవర రాజబాబు, ఉమ్మి రమణ, పలివెల మల్లేశ్వరరావు, దేవర మహారాజ్, తులాల అప్పలనాయుడు, మామిడి అప్పారావు, ఈసరపు పాండవులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా సంక్షేమ సందేశం విజయవంతంగా యాత్ర




**పెనుమంట్ర ఆగస్టు 14 మనం న్యూస్ :** ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం క్లస్టర్-2 పరిధిలో 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి' కార్యక్రమం 100 శాతం పూర్తయింది. ఈ సందర్భంగా శుక్రవారం మార్టేరు గ్రామంలోని వేణుగోపాల శ్రీ ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహించారు.క్లస్టర్-2 ఇన్చార్జి కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ఆచంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ వెళ్లిన పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే అభినందించారు.ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలకంగా పనిచేశారని పితాని పేర్కొన్నారు. అనంతరం క్లస్టర్-2 పరిధిలోని తొమ్మిది గ్రామాల గ్రామ అధ్యక్షులు, యూనిట్ బాధ్యులు, పోలింగ్ కేంద్రాల బాధ్యులు, సమన్వయకర్తలు, ప్రధాన కార్యదర్శులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల బాధ్యులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తితో పరకాల ట్రస్ట్ ప్రస్థానం

- సాయం,సహకారం దిశగా 15 ఏళ్లుగా కృషి
- పరకాల సూర్యమోహన్




**పోడూరు, ఆగస్టు 14 మనం న్యూస్ :** సేవా స్ఫూర్తితో సాయం, సహకారం అందిస్తూ పరకాల ట్రస్ట్ గత 15 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తోందని ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్యమోహన్ అన్నారు. పోడూరు మండలం కవిటంలోని పరకాల ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ట్రస్ట్ కోశాధికారి పరకాల రాజేశ్వరరావుతో కలిసి ఆయన పాత్రికేయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సూర్యమోహన్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది కూడా కవిటంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కవిటం స్టేట్ బ్యాంకు మేనేజర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని అందించనున్నట్లు వెల్లడించారు.అలాగే ప్రముఖ వైద్యులు పోడూరు కృష్ణమూర్తి, హోమియో వైద్యులు పావని, జనార్ధన్ చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సూర్యమోహన్ వెల్లడించారు. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం, విద్యార్థులను ప్రోత్సహించడం, సేవా కార్యక్రమాలను విస్తరించడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.అలాగే పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన పార్కును పలువురు మహిళలు, చిన్నారులు వినియోగించుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, అలాగే పూర్వం కెనాల్ వీధి గా ఉన్న మా వీధి పేరును మా ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి గ్రామపంచాయతీ వారు పరకాల వారి వీధి గా మార్చడం తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలియజేశారు.


## ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాక ర్యాలీ




**ఏలేశ్వరం,ఆగస్టు 14,(మనం న్యూస్ ):** పట్టణంలోని శ్రీ సూర్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో 325 అడుగుల త్రివర్ణ పతాకాన్ని ఏలేశ్వరం లయన్స్ క్లబ్ సభ్యులు బాలాజీ చౌక్ సెంటర్ నుండి ప్రభుత్వాసుపత్రి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ అనుసూరి నాగేశ్వరరావు,జ్యోతుల నాగ శ్రీనివాస్,ఊర రాజబాబు,గొల్లపూడి గణేష్,తండూరి రాము,కె.వీర వెంకట సత్యనారాయణ,రౌతు సహదేవుడు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర తపస్వీ...డాక్టర్ లగడపాటి సంగయ్య


**తెలుగు సాహితీవనంలో పరిశోధన ఒక ఎత్తైతే, ఆ పరిశోధనను సృజనాత్మక కావ్యాలుగా మలిచి అక్షరార్చన చేయడం మరొక ఎత్తు. ఈ రెండు ప్రక్రియల్లోనూ సమాన ప్రతిభను కనబరుస్తూ, తెలుగు భాషా వికాసానికి నిరంతరం శ్రమిస్తున్న అరుదైన అక్షర మూర్తి డాక్టర్ లగడపాటి సంగయ్య. సుదీర్ఘకాలం అధ్యాపకుడిగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా, ఆరుద్ర సాహిత్య పరిశోధనలో 'పరమేశ్వరుడు'గా కీర్తించిన అక్షర తపస్వి డా.సంగయ్య**












(అమరావతి,పి. మీరా హుస్సేన్, మనం ప్రత్యేక ప్రతినిధి): ఆధునిక కాలంలో పద్య కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్న లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్త డా. లగడపాటి సంగయ్య. ఆయన 1954 జూలై 1న కృష్ణా జిల్లా, నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామంలో రాంబాయమ్మ, కృష్ణమూర్తి దంపతులకు జన్మించారు. జొన్నలగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఆయన, శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి బి.ఓ.ఎల్. డిగ్రీని అందుకున్నారు.ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. తెలుగులో విశ్వవిద్యాలయ సర్వప్రథమునిగా నిలిచి ప్రతిష్ఠాత్మక 'గురజాడ అప్పారావు స్వర్ణపతకం' (1979-1981) కైవసం చేసుకున్నారు. అదే విశ్వవిద్యాలయం నుండి 'ఆధునికాంధ్ర కవిత్వంలో వ్యక్తీకరణ వైచిత్రీ ప్రియత్వం' అనే అంశంపై ఎం.ఫిల్, అలాగే 'ఆరుద్ర జీవితం-రచనలు-సమగ్ర పరిశీలన' పై పిహెచ్.డి. పట్టా సాధించి పరిశోధనా రంగంలో తనదైన ముద్ర వేశారు.అధ్యాపక వృత్తి - విద్యార్థుల గుండెల్లో స్థానంసంగయ్య 1984 నుండి 2012 వరకు నందిగామలోని కాకాని వెంకటరత్నం కళాశాలలో తెలుగు విభాగం అధిపతిగా, రీడర్గా సేవలందించి పదవీ విరమణ చేశారు. కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థులలో భాషాభిమానాన్ని, నైతిక విలువలను పెంపొందించిన ఆదర్శ గురువుగా ఆయన నిలిచారు.అద్భుత ముద్రిత గ్రంథాలు - సాహిత్య సృజనడా. లగడపాటి సంగయ్య కేవలం విమర్శకుడే కాదు, గొప్ప పద్య కవి కూడా. ఆయన కలం నుండి జాలువారిన కొన్ని ప్రముఖ రచనలు:ఆరుద్ర జీవితం - రచనలు - సమగ్ర పరిశీలన (1991): ఆరుద్ర సాహిత్యంపై వచ్చిన అత్యుత్తమ పరిశోధనా గ్రంథాలలో ఒకటిగా ఇది నిలిచింది.కాకతీయుల శాసనాలలో ఛందో వైవిధ్యం: ఈ పరిశోధన గ్రంథాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023 లో ప్రతిష్ఠాత్మకంగా ముద్రించింది.పల్లె - పట్టణం (పద్య కావ్యం): తానా నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో ఈ కావ్యానికి 4వ స్థానం లభించింది.ఆంధ్ర రఘు వంశం: మహాకవి కాళిదాసు సంస్కృత రఘువంశంలోని ఆరు సర్గలను అద్భుతంగా తెలుగులోకి పద్యానువాదం చేశారు.ఇతర కావ్యాలు: ముక్త సంగయోగి త్రిశతి, కంఠాగ్ని కరోనా ఖండ కావ్యం, తెలుగు ధీర శతకం, ఆధునిక కవిత్వం-వైచిత్రీ ప్రియత్వం వంటి ఎన్నో గ్రంథాలను ఆయన జాతికి అందించారు.దీనితో పాటు తెలుగు దినపత్రికలు, సాహిత్య మాసపత్రికలలో (అమృతలత, స్రవంతి, మిసిమి, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర) గురజాడ, ఆరుద్ర, మధురాంతకం రాజారాం వంటి ప్రముఖులపై వందలాది సాహిత్య వ్యాసాలు రాశారు.వరించిన పురస్కారాలు గౌరవాలుఆయన చేసిన అక్షర సేవకు జాతీయ, ప్రాంతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు దక్కాయి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది విశిష్ట పురస్కారం (2025)పరిశోధన పరమేశ్వరుడు ఆరుద్ర పురస్కారం (ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య)భారత విద్యా శిరోమణి పురస్కారం (ఇండియన్ సాలిడారిటీ కౌన్సిల్, న్యూఢిల్లీ)రాష్ట్రీయ విద్యా గౌరవ్ స్వర్ణ పతకం (ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మేనేజ్మెంట్, న్యూఢిల్లీ - 2011)విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు స్మారక పురస్కారం (2024)కిన్నెర-ఆరుద్ర పురస్కారం (2025)ముగింపుప్రస్తుతం నందిగామలో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, ఆయన కలం విశ్రమించలేదు. నిరంతరం కొత్త గ్రంథాల రచన, పద్య సాధనతో నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. డాక్టర్ లగడపాటి సంగయ్య తెలుగు భాషా సరస్వతి కిరీటంలో ఒక వెలుగులీనే రత్నం అనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి తరం పరిశోధకులకు, కవులకు ఆయన జీవితం, సాహితీ ప్రస్థానం ఒక దిక్సూచి.

## టాక్స్ చెల్లించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సీజ్

**అమలాపురం ఆగస్టు 14 మనం న్యూస్ :** ఈతకోట టోల్ ప్లాజా వద్ద 32 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులుఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా రవాణా శాఖ అధికారి దేవి శెట్టి శ్రీనివాస రావు తెలిపారు ట్యాక్స్ చెల్లించని బస్సుని సీజ్ చేసి నిబంధనలు సక్రమంగా పాటించని 10 బస్సులపై కేసులు నమోదు చేసి 2,40,800/- అపరాధ రుసుము విధించామని అతివేగం, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ అదేవిధంగా వ్యక్తిగత బ్యాగేజీ మినహా కమర్షియల్ లగేజీ తో ప్రయాణించే బస్సు పట్టుపడితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్స్ ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, షణ్ముఖ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకు వీడ్కోలు పలికిన ఉచ్చిల రవి




**కాట్రేనికోన ఆగస్టు 14 మనం ప్రతినిధి :** వైసీపీ నుండి ఎమ్మెల్సీగా సేవలందించిన డాక్టర్ పండుల రవీంద్ర బాబు పదవీకాలం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఉప్పూడి వైసీపీ సీనియర్ నాయకుడు ఉచ్చిల రవి కుమార్, ఆయన తనయుడు ఉచ్చిల ప్రశాంత్ రవీంద్ర బాబు ను అయన నివాసం లో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ



**ముమ్మిడివరం,ఆగస్టు 14,మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ కమిషనర్ పి.రవివర్మ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీని నిర్వహించారు.జాతీయ జెండా పట్ల దేశ భక్తి, గౌరవం, జాతీయ సమైఖ్యత చాటుతూ హర్ ఘర్ తిరంగా యొక్క సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ. కె.శ్రీనివాసు, మేనేజర్ ఇంచార్జ్ కె.వదన్, ఆర్.ఐ. భాస్కరరావు, అడ్మిన్ పి.శ్రీనివాస్, స్వర్ణ వార్డు సిబ్బంది, నగర పంచాయతి మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు కారుణ్య ట్రస్ట్ ఆర్థిక చేయూత



**యలమంచిలి, ఆగస్టు 14 మనం న్యూస్ :** ఆచంట గ్రామ శివారు దొడ్డివారిపాలెంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా జీవిస్తున్న మాధురి, మహిత, జగదీష్ అనే ముగ్గురు పిల్లలకు కారుణ్య ట్రస్ట్ అధినేత తుంగ నాగేశ్వరరావు అండగా నిలిచారు.పిల్లల పరిస్థితిని కడలి రాము ద్వారా తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి గుంపర్రులోని తన కార్యాలయంలో రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.పిల్లల చదువు, భవిష్యత్తు అవసరాలపై ఆరా తీసి, ఇకపై ఎలాంటి అవసరం వచ్చినా కారుణ్య ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తుంగ నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల పరిస్థితి తనను కలచివేసిందన్నారు. పిల్లలు పలువురిని కలిసి సహాయం కోరిన విషయం తెలిసి వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించామన్నారు.వారు ధైర్యంగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయం అందించేం దుకు కారుణ్య ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. తమ పరిస్థితిని తెలుసుకుని వెంటనే రూ.50 వేల సహాయం అందించిన తుంగ నాగేశ్వరరావుకు ముగ్గురు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.

## బూత్ స్థాయి కార్యకర్తల సంస్థాగత సమావేశం



**కాట్రేనికోన ఆగస్టు 14 మనం ప్రతినిధి :** నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సంస్థాగత సమావేశం ముమ్మిడివరం నియోజకవర్గ బూత్ స్థాయి మొదటి కన్వీనర్( బి ఎల్ ఏ 1) గొల్ల కోటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మహిపాల్ చెరువులోని వి కన్వర్షన్ హాల్ నందు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోనసీమ జిల్లా ఇంచార్జ్ కారంకి శ్రీనివాస్, కోనసీమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కార్యదర్శి రుద్రరాజు నరేంద్ర వర్మ, జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, కొప్పనాతి దత్తాత్రేయ వర్మ, ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మండలాధ్యక్షులు యనమండ్ర విజయ్ కుమార్, సఖి రెడ్డి శ్రీనివాస్, సన్నిధి రాజు, వీరభద్ర శర్మ, చప్పిడి శ్రీ దుర్గా, కాట్రేనికోన మండల ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టా సూరిబాబు, రాయపు రెడ్డి, భైరవమూర్తి, ముమ్మిడివరం టౌన్ ఇంచార్జ్ ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ బూత్ స్థాయి రెండవ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



**కళ్యాణదుర్గం టౌన్, ఆగష్టు 14 మనం న్యూస్:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ముదిగల్లు బైపాస్ రోడ్డులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. అనంతరం ముదిగల్లు బైపాస్ కూడలిలో బస్ షెల్టర్, వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసం త్బాబు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# జేసీ దివాకర్ రెడ్డిని కలసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



సింగనమల ఆగస్టు 14 మనం న్యూస్: మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ని, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ని ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఈ సందర్భంగా మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జేసీ ప్రభాకర్ రెడ్డి ని కలిసి, తాడిపత్రి నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి చర్చించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతతోనే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అలాగే ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితిపై చర్చించారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు




- **ఇంటింటా చెట్టు ఊరంతా వనం**

**హిందూపురం, ఆగస్టు 14 (మనం న్యూస్):** పద్మభూషణం నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, హిందూపురం రూరల్ మండలం బేవనహళ్లి పంచాయితీ నక్కలపల్లి గ్రామం నందు శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.గ్రామంలో సత్తెమ్మ గుడి దగ్గర మై ఇండియా మై విజన్ మొక్కలు నాటే కార్యక్రమంలో భూమి పూజలో ఎంపీటీసీ నాగరాజు, నారాయణరెడ్డి ,ఫీల్ అసిస్టెంట్ సోమయ్య ,గ్రామ కమిటీ అధ్యక్షుడు మారుతీ, స్టోర్ డీలర్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఆయకట్టు చైర్మన్ బాబురెడ్డి, అంజిన రెడ్డి,ఆయకట్టు చైర్మన్ గోపాలప్ప,విద్య కమిటీ చైర్మన్ నరసింహామూర్తి,,గ్రామ కమిటీ వైస్ అధ్యక్షులు చిన్న రాజు ,కుమార్ ఐటీడీపి మంజు,తెలుగు యువత రూరల్ మండల అధ్యక్షులు రామకృష్ణ ,బాబు బీసీ సెల్ రూరల్ మండల్ అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు కార్య కర్తలు పాల్గొనడం జరిగింది.

# రైల్వే రోడ్డు ఏర్పాట్ల పరిశీలన



**హిందూపురం, ఆగస్టు 14 (మనం న్యూస్):** హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం అభివృద్ధి పనుల్లో భాగంగా హిందూపురం నడిబొడ్డున ఉన్న రైల్వే రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండడంతో ఆగస్టు 15 న జాతీయ పండుగ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీ , పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ , నాగరాజు , మాజీ మున్సిపల్ చైర్మన్ డి.ఈ. రమేష్ , మైనారిటీ ఆర్ఎంఎస్ షఫీ , డైమండ్ బాబా , అమర్నాథ్ , చంద్ర , రఘు, రాజు, అశోక్, ఐటీడీపీ నవీన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాచీన వైద్యంలో ఆయుర్వేదం సాటిలేనిది



- **ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో మరింత అవగాహన అవసరం**
- **పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి, ఆగస్టు 14మనం న్యూస్:** ప్రాచీన వైద్య విధానాల్లో ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉందని, ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్య సేవలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. పుట్టపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి గోకుల్ ఆయుర్వేదిక్ మెడికల్ స్టోర్ను శుక్రవారం మాజీ మంత్రి, టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆయుర్వేద మందులు, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మన ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తిలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య ఉత్పత్తులు అందుబాటులోకి రావడం సంతోష కరమన్నారు. సాయి గోకుల్ ఆయుర్వేదిక్ మెడికల్ స్టోర్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం స్టోర్ నిర్వాహకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ యుగాంధర్, హరినాథ్లను ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేత గంగాధర్ నాయుడు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, స్టోర్ నిర్వాహకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# మూడేళ్ల చిన్నారి 79 కిలోమీటర్ల నాన్‌స్టాప్ స్కేటింగ్



- **ప్రపంచ రికార్డు లక్ష్యంగా చిన్నారి అనంత దక్షిత్ సాహసయాత్ర**
- **అభినందించిన ఎమ్మెల్యే కందికుంట**

**కదిరి ఆగస్టు 14 మనం న్యూస్:** మూడేళ్ల వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తూ అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన చిన్నారి అనంత దక్షిత్ ప్రపంచ రికార్డు లక్ష్యంగా సాహసయాత్ర శుక్రవారం చేపట్టారు. మదనపల్లె నుంచి కదిరి వరకు ఏకంగా 79 కిలోమీటర్ల నాన్స్టాప్ స్కేటింగ్ చేస్తూ చిన్నారి దక్షిత్ కదిరి పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కదిరి పట్టణంలోని నానా దర్గా వద్ద సాయంత్రం 6 గంటలకు చిన్నారి దక్షిత్కు ఘన స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ హాజరై చిన్నారి దక్షిత్ను అభినందించారు. ఈ చిన్నారి వయసు కేవలం మూడేళ్లు అయినప్పటికీ ఇంతటి సుదీర్ఘ దూరాన్ని స్కేటింగ్ చేస్తూ ప్రపంచ రికార్డు లక్ష్యంగా ముందుకు సాగడం పట్ల ఎమ్మెల్యే అభినందనలు చిన్నారి దక్షిత్కు మద్దతుగా పట్టణ ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. మూడేళ్ల వయసులోనే ఇంతటి సాహసం చేస్తున్న దక్షిత్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రజలు ఆకాంక్షించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్స్ లక్ష్యంగా సాగుతున్న ఈ చిన్నారి సాహసయాత్ర అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తో పాటు టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ కేస్ దిల్షాద్నిస బహుద్దిన్ టిడిపి నాయకులు జావిద్ హైదర్ మాజీ కౌన్సిలర్లు కూటమి నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆపదలో ఆదుకోవడమే ప్రజాసేవ

- **34 మంది లబ్ధిదారులకు రూ.32.69 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**



**ధర్మవరం, ఆగస్టు 14, మనం న్యూస్:** అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 34 మంది లబ్ధిదారులకు రూ.32.69 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తీవ్రమైన అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందన్నారు. వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ వైద్య, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ సాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్కు కృతజ్ఞతలు తెలిపారు.

# చేనేత మంత్రి ఇలా ఖాలో చేనేతలకు తీవ్ర అన్యాయం..



- **అనర్హులకు అందలం.. అర్హులకు మొండిచేయి..**
- **నిజమైన నేతన్నలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు..**
- **మాజీమంత్రి ఉషశ్రీ చరణ్**

**సోమందేపల్లి టౌన్ ఆగష్టు 14 మనం న్యూస్:** సోమందేపల్లి మండలంలో నేతన్నలను నిట్టనిలువునా చేనేత జోలి శాఖ మంత్రి సవిత ముంచారని ఆరోపిస్తూ వైకాపా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద చేనేతలు నాయకులతో కలిసి భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె నినాదాలు ఇస్తూ చేనేత మంత్రి ఇలాఖాలో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. మండలంలో 210 మంది చేనేత సబ్సిడీ విద్యుత్ లబ్ధిదారులుండగా, 813 మందికి నేతల నేస్తం కింద 25000 ఇవ్వడం జరిగిందన్నారు. అందులో అసలైన లబ్ధిదారులు 50 మంది కూడా లేరన్నారు. ఒక చీర తయారీలో ఎంత కష్టం ఉంటుందో నేతన్న కు మాత్రమే తెలుసన్నారు.

నేతన్న చేతుల్లో రూపుదిద్దుకునే ప్రతి చీర వెనుక అతని చెమట, శ్రమ, కన్నీరు, కుటుంబం భవిష్యత్తు దాగి ఉంటుం దన్నారు. నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందాల్సింది పోయి, చేనేతల పేరుతో అనర్హులకు ప్రయోజనాలు అందడం విడ్డూర మన్నారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమానికీ ప్రాధాన్యం

- **జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం, ఆగస్టు 14: మనం న్యూస్:** పోలీసు అధికారులతో పాటు క్షేత్రస్థాయి కానిస్టేబుళ్ల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ సిబ్బంది, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేకంగా వారి 'గ్రీవెన్స్' (సమస్యల స్వీకరణ) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల నుంచి అధికారుల స్థాయి వరకు ఎదుర్కొంటున్న పలు వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలపై ఎస్పీ నేరుగా ఆరా తీశారు. ప్రధానంగా వెల్ఫేర్ లోన్ల మంజూరు, ప్రమోషన్లు పొందిన వారికి సంబంధిత ఇంక్రిమెంట్లు అందజేయడం, వెరికోస్ వేన్స్ ఆపరేషన్లు చేయించుకున్న వారికి సంబంధించిన వైద్య బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై సిబ్బంది వినతులు సమర్పించారు. ఈ కాన్ఫరెన్స్లో మొత్తం 9 వినతులు రాగా, వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన అదనపు ఎస్పీ... సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి మరింత భరోసా

**ధర్మవరం, ఆగస్టు 14, మనం న్యూస్:** ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ నమోదు కేంద్రాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో నెలకు ఓపీ సంఖ్య 22 వేల నుంచి 24 వేలకు పెరగడంతో రద్దీని తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టామన్నారు.ఆసుపత్రిలో గత రెండేళ్లలో రూ.2.10 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామని, 10 పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. బ్లడ్బ్యాంక్ ఏర్పాటుకు కేంద్రం నుంచి ఆమోదం లభించిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజల సంతృప్తిని 85-90 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. రోగులతో ఆరా: ఓపీ కేంద్రం ప్రారంభించిన అనంతరం మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్యులు, మందులు, శానిటేషన్ సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పేదలకు వేగవంతంగా, నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి 'ఆరోగ్య ధర్మవరం'గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్, ఆర్ఎంవో హరిశ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్వో భాగ్యలక్ష్మి, వైద్యులు, హెచ్డీఎస్ కమిటీ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



# సేవా మార్గంలో కారుణ్య ట్రస్ట్ సుదీర్ఘ ప్రస్థానం

- **పేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తున్న తుంగా నాగేశ్వరరావు**
- **ఆచంట నియోజకవర్గంలో మరింత విస్తృతంగా సేవలు.జనసేనలో చేరేందుకు సన్నద్ధత**

**భీమవరం ఆగష్టు 14 మనం న్యూస్ :** సేవే లక్ష్యంగా, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కారుణ్య ట్రస్ట్ ద్వారా గత రెండు దశాబ్దాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ అధినేత, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన తుంగా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ట్రస్ట్ కార్యాలయంలో ఆచంట నియోజకవర్గ పాత్రికేయుల సమావేశం నిర్వహించి, ట్రస్ట్ సేవా ప్రస్థానానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా తుంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్న స్థాయిలో ప్రారంభమైన కారుణ్య ట్రస్ట్ సేవలు నేడు రాష్ట్రస్థాయిలో వివిధ రూపాల్లో విస్తరించాయని తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవడంతో పాటు పేద విద్యార్థులను తమ సొంత ఖర్చులతో చదివిస్తూ, వారికి ఉన్నత విద్యను అందించి జీవితంలో స్థిరపడేలా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అకాల వర్షాలు, తుపానులు, కరువు వంటి విపత్కర పరిస్థితుల్లో బాధిత ప్రజలకు అవసరమైన సహాయాన్ని ట్రస్ట్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన 50 మంది వృద్ధులకు ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున తన సొంత ఖర్చులతో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడలు, విద్య, ఉపాధి, సామాజిక సేవ వంటి రంగాల్లో వారికి అవసరమైన సహకారం అందించేందుకు కూడా ముందుకు సాగుతున్నామని తెలిపారు. యువత తమ ప్రతిభను గుర్తించి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమన్నారు. ప్రజలకు అవసరమైన సందర్భాల్లో స్పందిస్తూ, తమకు సాధ్యమైన ప్రతి మార్గంలో సేవలు అందిస్తున్నామని చెప్పారు.తాను స్వతహాగా చిరంజీవి అభిమానినని, అనంతరం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజాసేవా దృక్పథానికి ఆకర్షితుడినయ్యానని నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తన ఆలోచనలకు



జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ సేవా భావన మరింత స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు.త్వరలో మంచి రోజును చూసుకుని పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరి, ఆచంట నియోజకవర్గ వ్యాప్తంగా కారుణ్య ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఇప్పటికే ఆచంట నియోజకవర్గ పరిధిలో అవసరంలో ఉన్న ప్రజలకు కారుణ్య ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారని, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు. పేదల కన్నీరు తుడవడమే తన జీవిత ధ్యేయమని, భవిష్యత్తులోనూ జనసేన నాయకుడిగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తుంగా నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**



**కదిరి రూరల్ ఆగష్టు 14 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్లో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , ఆర్డీవో ఆవుల కళావతి , జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజా దర్బార్కు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలు, వినతులను జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ , అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ , ఎమ్మెల్యే లు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యతనిస్తూ, అర్హత ఉన్న ప్రతి సమస్యను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రెడ్డి శేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వారానికోసారి పాస్‌వర్డ్ మారుస్తా: నాగార్జున

సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ సైబర్ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారని అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రశంసించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లో జరిగిన 'సురక్ష కా తిరంగా' సైబర్ అవగాహన కార్యక్రమానికి డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గతంలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదేళ్ల క్రితం తనను ఓ వ్యక్తి మోసం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు.

1977లో తాను ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లోనే కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయని, అప్పట్లో మాల్ వేర్ హ్యాకింగ్ పై ప్రొఫెసర్లు తీవ్రంగా హెచ్చరించేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సైబర్ నేరాల సమస్య కొనసాగుతూనే ఉందన్నారు. తాను కూడా సైబర్ నేరాల బాధితుడినేనని నాగార్జున చెప్పారు. ''ఐదేళ్ల క్రితం ఓ వ్యక్తి బ్యాంక్ అధికారిగా నటిస్తూ, పెట్టుబడుల పేరుతో నన్ను మోసం చేసేందుకు ప్రయత్నించాడు. అంతేకాకుండా విదేశాలకు మాదకద్రవ్యాల పార్సిల్ పంపారంటూ నేరగాళ్లు బెదిరింపు ఫోన్ కాల్స్ కూడా చేశారు. చివరకు నా కుటుంబంలోని కొందరిని మాయమాటలతో భయపెట్టి 6 నుంచి 7 గంటల పాటు డిజిటల్ అరెస్ట్ చేశారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతా నియమాలు పాటించాలని నాగార్జున సూచించారు. ''సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటం, వాటిని అరికట్టడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత. నేనైతే ముందు జాగ్రత్తగా వారానికి ఒకసారి మొబైల్ పాస్వర్డ్, నెలకు ఒకసారి వైఫై పాస్వర్డ్ మారుస్తాను. నా మొబైల్లో కనీసం ఫోటోలు కూడా స్టోర్ చేయను'' అని వివరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ పోలీసుల చర్యలను నాగార్జున అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఇతర దేశాలకు వెళ్లి మరీ అరెస్టులు చేసిన ఘనత తెలంగాణ పోలీసులకే దక్కుతుందన్నారు. అలాగే తెలుగు సినీ రంగంలో పైరసీని అరికట్టడంలో ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, సజ్జనార్ ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పైరసీ నియంత్రణలో తెలంగాణ పోలీసులు తీసుకున్న కఠిన చర్యల వల్ల కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే కాకుండా, మొత్తం భారతీయ సినీ పరిశ్రమకు ఎంతో మేలు జరిగిందన్నారు.

# లెఫ్టినెంట్ కల్నల్‌గా వెంకీ మామ..




టాలీవుడ్ సక్సెస్ ఫుల్ దర్శకుడు అనిల్ రావిపూడి మరో కొత్త సినిమా చేస్తున్నారు. విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఇద్దరితో కలిసి ఓ భారీ ప్రాజెక్టు చేపట్టారు. ప్రస్తుతం సెట్స్ పై ఉన్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఈ మూవీలో వెంకటేష్ సరసన హీరోయిన్ గా కీర్తి సురేష్ నటిస్తుండగా, కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కొన్ని అప్డేట్స్ రాగా, తాజాగా వెంకీ మామ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు.

ఆయన ఇండస్ట్రీలోకి వచ్చి 40 సంవత్సరాలు అయిన నేపథ్యంలో ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ లాంచ్ చేసింది అనిల్ రావిపూడి టీమ్. ఇక ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ గెటప్ లో వెంకటేష్ మెరిశారు. ఓ భారీ వాహనం ముందు.. ఆర్మీ డ్రెస్ వేసుకొని, పవర్ ఫుల్ అధికారిగా మెరిసారు వెంకీ మామ. ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి పాత్రలో వెంకీ మామ మెరువనున్నాడు. ఈ మేరకు చిత్ర బృందం అప్డేట్ ఇచ్చింది. ఇక ఈ పోస్టర్ చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు.

# 'సనాతన ధర్మం'పై నా మాటలు వక్రీకరించారు: అనసూయ పోస్ట్




నటి అనసూయ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల హిందూ ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై అనసూయ స్పందిస్తూ ఇన్ స్టా వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని, తాను ఏ మత విశ్వాసాలనూ కించపర్చేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు.

''నా మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు. అందుకే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది. నేను మాట్లాడింది కొంతమంది గురించి మాత్రమే. నాపై అభ్యంతర కామెంట్లు చేస్తూ, వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు దిగే వాళ్ల గురించే నేను చెప్పాను. అది ఏ మతాన్ని గానీ, వర్గాన్ని గానీ ఉద్దేశిస్తూ చెప్పిన మాట కాదు. నన్ను టార్గెట్ చేస్తున్న వాళ్లకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను సనాతన ధర్మాన్ని పాటించే హిందువుని. నా ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి చింత లేదు. ధైర్యంగా ఉండటం.. నిజం వైపు నిలబడటం, తప్పును తప్పు అని చెప్పడం, ఎదుటివారిని మనిషిగా గౌరవించడం.. ఇవన్నీ నాకు ధర్మమే నేర్పింది. హనుమాన్ జీ ధైర్యం, బలమే నాకు స్ఫూర్తి. అందువల్ల అన్యాయం జరిగినప్పుడు మాట్లాడకుండా ఉండలేను. నా మాటల నుంచి అసలు విషయం తొలగించి.. సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు. మతం ఆధారంగా నేను ఎవరిపైనా ఓ నిర్ణయానికి రాను. వేధించే వాళ్లను మాత్రమే ప్రశ్నిస్తా. అందువల్ల ఎడిట్ చేసిన క్లిప్లు, సగం సగం కథనాల వలలో పడకండి. అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతే ఓ అభిప్రాయానికి రండి'' అని అనసూయ తన పోస్ట్లో రాసుకొచ్చారు.

# మేఘాంశ్ శ్రీహరి కొత్త చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల!



దివంగత నటుడు శ్రీహరి జయంతి సందర్భంగా ఆయన తనయుడు మేఘాంశ్ శ్రీహరి కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్ర ఫస్ట్ లుక్ ను చిత్రబృందం విడుదల చేసింది. భైరవకాళి ఫ్లిక్స్ పతాకంపై లెల్లా రాహుల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి లెల్లా రోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పోతురాజు ఆహార్యంలో ఉన్న మేఘాంశ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ త్వరలోనే టైటిల్ గ్లింప్స్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

# 600వ టెస్టుకు నాయకత్వం గర్వంగా ఉంది.. ఆ బెర్తే మా లక్ష్యం: గిల్

శనివారం నుంచి శ్రీలంకతో టీమ్ఇండియా తొలి టెస్టు మ్యాచ్ లో తలపడనుంది. మరోవైపు టెస్టు సారథిగా శుభ్ మన్ గిల్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్లో భారత్ కిది 600వ మ్యాచ్. ఇలాంటి మైలురాయి టెస్టుకు నాయకత్వం వహించనుండటం గర్వంగా ఉందని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుందని తెలిపాడు.



''కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగానే ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్ లోనూ విజయం సాధించి వరల్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ బెర్తు ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం'' అని గిల్ తెలిపాడు.

సమయం ఇవ్వాలి..

''మెరుగ్గా మారేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం ఇవ్వాలి. కొందరికి కాస్త ఎక్కువ టైమ్ పడుతుంది. అయినా సరే వారికి మద్దతుగా నిలుస్తాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బాగా ఆడాడు. అతడు గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ - మేనేజ్మెంట్ మధ్య సంబంధాలు సరిగా లేవని వస్తోన్న ఆరోపణలన్నీ అవాస్తవం. మేం అనుకొన్నంత వేగంగా సాయి సుదర్శన్ ఇంప్రూవ్ కాలేదు. అయితే, మా స్క్వాడ్లోని 15 మందిపై నమ్మకం ఉంది. తుది జట్టు ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేను. పేసర్ల విషయంలోనూ ఎంపిక కష్టంగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. బౌన్సు రాబడతాడు. అయితే, ప్రసిద్ధ్ వార్మప్ మ్యాచ్లో చాలా చక్కగా బంతులేశాడు. సిరాజ్తోపాటు మరొక పేసర్ ఎవరనేది తేల్చడం కాస్త క్లిష్టమైన నిర్ణయమే. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఫైనల్ గేఐను ప్రకటిస్తాం'' అని శుభ్మన్ గిల్ స్పష్టం చేశాడు.



## క్వార్టర్స్‌లో అర్జున్, నిహాల్

ఈస్పోర్ట్స్ ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, నిహాల్ సరీన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. అర్జున్ 2-0తో పర్నేశ్ ను ఓడించాడు. నిహాల్ అర్మగెడాన్ లో వీ యిపై విజయం సాధించాడు. రెండు గేమ్ లు డ్రాగా ముగియడంతో ఆర్మగెడాన్ ఆడాల్సివచ్చింది. మాగ్నస్ కార్ల్ సన్, అలీరెజా, హికరు నకమురా, నాటస్ విన్సియర్, అబ్దుసతరోవ్ ఇంతకుముందే క్వార్టర్స్ కు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో నాలుగు గేమ్ లు ఉంటాయి. సెమీఫైనల్లో ఆరు గేమ్ లు ఆడతారు. ఫైనల్లో బెస్టార్ ఫ్రీ సెట్స్ మ్యాచ్ ఉంటుంది. తొలి రెండు సెట్లలో నాలుగేసి గేమ్ లు ఉంటాయి. మూడో సెట్లో రెండు గేముల్లో తలపడాల్సివుంటుంది.



# పెద్ద బాధ్యతల్లోకి వీవీఎస్ లక్ష్మణ్.. అజిత్ అగార్కర్‌కూ గుడ్‌న్యూస్!

టీమ్ఇండియా మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్కు అధిపతిగా ఉన్నారు. అయితే, ఆయనకు ఇంకాస్త పెద్ద బాధ్యతలను అప్పగించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మరోవైపు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా తన పదవిని పొడిగించుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్లో భారత క్రికెట్ బోర్డు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఇందులోనే కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తొలుత లక్ష్మణ్కు ప్రధాన కోచ్ లేదా చీఫ్ సెలక్టర్ పదవిని ఇస్తారనే ప్రచారం సాగింది. బీసీసీఐకి తదుపరి అధ్యక్షుడిని చేస్తారనే ఊహాగానాలు కూడా వచ్చాయి. కానీ, లక్ష్మణ్ను బీసీసీఐ డైరక్టర్ ఆఫ్ క్రికెట్ గా నియమిస్తారని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.

**డైరక్టర్ ఆఫ్ క్రికెట్ గా బాధ్యతలు ఏంటి?**

దేశవ్యాప్తంగా క్రికెట్ నిర్వహణకు సంబంధించి కీలక బాధ్యతలను డైరక్టర్ ఆఫ్ క్రికెట్ గా నియమితులైన వారు పర్యవేక్షించాలి. సీనియర్ జట్టు, సెలక్టర్లు, కోచ్ లు, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, వివిధ దశల్లోని క్రికెటర్లతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. ప్రతిభను గుర్తించడం, క్రీడాకారుల వృద్ధికి సహకరించడం, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన వచ్చేలా ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయడం వంటి కార్యకలాపాలను నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, సీవోఈలో ఇప్పటికే ఇలాంటి బాధ్యతల్లోనే లక్ష్మణ్ ఉన్నారు.

**అజిత్కు పొడిగింపు**

ప్రస్తుత చీఫ్ సెలక్టర్గా ఉన్న అజిత్ అగార్కర్ పదవీ కాలం సెప్టెంబర్లోనే ముగియనుంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఇలాంటి సమయంలో సెలక్షన్ కమిటీలో మార్పులు చేయడం కంటే కొనసాగించడమే మేలనే ఉద్దేశంలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే, వార్షిక సమావేశంలో అగార్కర్ పదవీకాలాన్ని వచ్చే ఏడాది జూన్ వరకూ పొడిగించాలని భావిస్తోంది. అలాగే లక్ష్మణ్ను డైరక్టర్గా తీసుకుంటే.. సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ హెడ్ బాధ్యతలను మరొకరికి అప్పగించాల్సి ఉంటుంది. మరి ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరమే.






Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.